


# విభారె
తెలుగు దినపత్రిక
VIBHARE TELUGU DAILY



ఆవుల పుల్లారెడ్డి సేవా సమితి
రి.నెం. 119/2015
ఆళ్ళగడ్డ, కర్నూలు జిల్లా
ఉచిత కళ్యాణ మండపం
స్వయం ఉపాధి శిక్షణ
ఉచిత రక్తదానము
ఉచిత న్యాయ సలహాలు
ఉచిత కంప్యూటర్ శిక్షణ
సంప్రదించవలసిన చిరునామా
ఆవుల విజయభాస్కర రెడ్డి
ఆళ్లగడ్డ
9440232308,9494498787



PUBLISHED FROM KURNOOL ఎడిటర్: ఆవుల విజయ భాస్కర రెడ్డి మంగళవారం 14-06-2022 సంపుటి : 03 సంచిక : 264 పేజీలు : 4 వెల : రూ 3-00


# ఆరోగ్య శ్రీ పరిధిలోకి మరిన్ని వైద్య చికిత్సలు



అమరావతి: వైద్యారోగ్య శాఖపై ముఖ్యమంతి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తాడేపల్లిలోని తన క్యాంప్ కార్యాలయంలో సమీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో కోవిడ్ పరిస్థితులు, ఆరోగ్యశ్రీ, దాని కింద కార్యక్రమాలు, వైద్య ఆరోగ్యశాఖలో నాడు ? నేడు కింద చేపడుతున్న పనులు, కొత్త మెడికల్ కాలేజీల నిర్మాణం, క్యాన్సర్ కేర్ తదితర అంశాలపై కీలక ఆదేశాలు జారీ చేశారు. ఏ తరహా ప్రసవం జరిగినా తల్లికి రూ.5వేలు ఇవ్వాలని సీఎం వైఎస్ జగన్ ఆదేశించారు.

ఆరోగ్య ఆసరా కింద తల్లికి రూ.5వేలు.

సహజ ప్రసవం జరిగినా, సిజేరియన్ జరిగినా రూ.5వేలు.

గతంలో సిజేరియన్ జరిగితే రూ.3వేలు కాగా, దీన్ని రూ.5వేలకు పెంచాలి.

సహజ ప్రసవం అయినా, సిజేరియన్ అయినా తల్లీబిడ్డల సంరక్షణ ముఖ్యం కాబట్టి, ఒకే మొత్తాన్ని ఇవ్వాలి.

సహజ ప్రసవాలను పెంచడంపై ప్రత్యేకంగా శ్రద్ధ పెట్టాలి.

సహజ ప్రసవంపై అవగాహన, చైతన్యం నింపాల్సిన బాధ్యత వైద్యులదే.

ఆరోగ్య శ్రీ పరిధిలోకి మరిన్ని వైద్య చికిత్సలు..

సమీక్ష సందర్భంగా ఆరోగ్యశ్రీ కింద అందుతున్న వివిధ కార్యక్రమాలకు ప్రభుత్వం చేస్తున్న ఖర్చును అధికారులు వివరించారు. ఆరోగ్యశ్రీలో 2,446 ప్రొసీజర్లు కవర్ అవుతున్నాయని అధికారులు తెలిపారు. ఈ క్రమంలో దీనిపై నిరంతర అధ్యయనం చేయాలని, అవసరాల మేరకు మరింత మంచి చేయడానికి ప్రొసీజర్ల సంఖ్యను పెంచాలని సీఎం వైఎస్ జగన్ ఆదేశించారు. కాగా, ఇప్పటికే దీనికి సంబంధించిన కసరత్తు ప్రారంభించామని అధికారులు తెలిపారు. వైద్యులు, వైద్య సంఘాలతో చర్చిస్తున్నామని చెప్పారు. ఈ క్రమంలో వారం రోజుల్లో దీనికి సంబంధించిన ప్రతిపాదనలు ఇవ్వాలని సీఎం వైఎస్ జగన్.. అధికారులను ఆదేశించారు.

మరింత పారదర్శకంగా ఆరోగ్య శ్రీ పథకం..

నేరుగా లబ్ధిదారుడి ఖాతాలోకి డబ్బు, అక్కడ నుంచి ఆస్పత్రికి ఆటోడెబిట్‌లో చెల్లింపులు, ఎవ్వరికీ అసౌకర్యం కలగకుండా ఈ ప్రక్రియ కొనసాగాలి. ముందుగా పేషెంటు డిశ్చార్జి అయ్యే సమయంలో కన్సెంటు ఫారం స్వీకరణ, పేషెంటు, బ్యాంకు, ఆస్పత్రి మధ్య కన్సెంటుతో కూడిన ఫారం ఇవ్వాలి. ఈ ప్రక్రియ సజావుగా సాగేందుకు తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను సీఎం వైఎస్ జగన్ ఆదేశించారు. ఈ విధానంలో చాలా వరకు పొరపాట్లను నివారించే అవకాశం ఉంటుందని సీఎం జగన్ తెలిపారు. కోవిడ్ పరిస్థితులన్నీ పూర్తిగా నియంత్రణలో ఉన్నాయని అధికారులు తెలుపగా.. అప్రమత్తంగా ఉండాలని సీఎం జగన్ ఆదేశించారు.

రాష్ట్రంలో కోవిడ్ వ్యాక్సినేషన్‌పై సీఎం సమీక్ష

18 సంవత్సరాల్లోపు వారికి కూడా రెండుడోసులు దాదాపుగా పూర్తి.

15 నుంచి 17 ఏళ్లలోపు వారికి 99.65శాతం వ్యాక్సినేషన్ పూర్తి.


12 నుంచి 14 ఏళ్లలోపు వారికి 97.78శాతం వ్యాక్సినేషన్ పూర్తి.

నిర్దేశించుకున్న సమయంలోగా పనులు..

విలేజ్ క్లినిక్స్, వార్డు క్లినిక్స్, కొత్త ఆస్పత్రుల నిర్మాణం, వీటిలో అభివృద్ధి పనులు నిర్దేశించుకున్న సమయంలోగా పూర్తిచేయాలని సీఎం జగన్ ఆదేశించారు. కాగా, విలేజ్ క్లినిక్స్, వార్డు క్లినిక్స్‌లో పునరుద్ధరణ పనులు పూర్తయ్యాయని, కొత్తవాటి నిర్మాణం కూడా పూర్తవుతోందని అధికారులు తెలిపారు. పీహెచ్‌సీల్లో 977 సెంటర్లలో అభివృద్ధి పనులు పూర్తయ్యాయని, కొత్తవాటి నిర్మాణం చురుగ్గా సాగుతోందని అధికారులు చెప్పారు.రాష్ట్రంలో కొత్తగా 16 మెడికల్ కాలేజీలు ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. విజయనగరం, రాజమండ్రి, ఏలూరు, మచిలీపట్నంలలో కొత్త మెడికల్ కాలేజీల్లో 2023 నుంచి మెడికల్ ప్రవేశాల కోసం ప్రభుత్వం కసరత్తు చేస్తున్నది. మెడికల్ కౌన్సిల్ మార్గదర్శకాల ప్రకారం చేయాల్సిన పనులు వేగంగా చేయడానికి ప్రయత్నాలు చేస్తున్నాము. ఇక్కడ డిసెంబర్ నాటికి నిర్మాణాలు పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటున్నామని అధికారులు తెలిపారు. ఈ క్రమంలో మిగిలిన చోట్ల కూడా నిర్మాణాలు వేగవంతం చేయాలని సీఎం వైఎస్ జగన్ ఆదేశించారు. ఒకటి రెండు చోట్ల స్థలాలపై కోర్టు కేసులున్నాయని అధికారులు తెలుపడంతో.. వాటిని వీలైనంత త్వరగా పరిష్కరించే ప్రయత్నం చేయాలని సీఎం జగన్ సూచించారు. భారత్ సహా ప్రపంచవ్యాప్తంగా క్యాన్సర్ కేసులు పెరుగుతున్నాయి. 2020లో ఏపీలో 34వేల మంది క్యాన్సర్ కారణంగా మృతి చెందారు. ప్రాథమిక దశలో గుర్తించకపోవడం వల్ల చాలా మంది మరణిస్తున్నారని అధికారులు తెలిపారు. చివరిదశలో గుర్తించి, చికిత్సకోసం భారీగా ఖర్చు చేస్తున్నారని అప్పటికే పరిస్థితి చేయిదాటిపోతుందని అధికారులు చెప్పారు. ఈ నేపథ్యంలో విలేజ్ క్లినిక్స్ స్థాయిలోనే క్యాన్సర్ గుర్తింపుపై దృష్టి పెట్టాలని సీఎం జగన్ ఆదేశించారు. అందుకోసం విలేజ్ క్లినిక్స్, వార్డు క్లినిక్స్, పీహెచ్‌సీలను వీలైనంత త్వరగా పూర్తిచేసుకోవాలని సీఎం సూచించారు. డిసెంబర్ కల్లా వీటిని పూర్తిచేయడానికి చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఇవి పూర్తి అయితే ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ విధానం సమర్థవంతంగా అమలు జరుగుతుంది, క్యాన్సర్ గుర్తింపు అన్నది సులభంగా జరుగుతుందని సీఎం జగన్ తెలిపారు. ఈలోగా సిబ్బందికి క్యాన్సర్ స్క్రీనింగ్‌పై శిక్షణ ఇప్పించాలని సూచించారు. దీని వల్ల క్యాన్సర్ గుర్తింపు నుంచి చికిత్స వరకూ సమర్థవంతమైన వ్యవస్థ ఏర్పడుతుందని సీఎం జగన్ తెలిపారు. ఈ సందర్భంగా టాటా మెమోరియల్ ద్వారా రాష్ట్రంలో వైద్య సిబ్బందికి, వైద్యులకు శిక్షణకు ఎంఓయూ కుదిరిందని అధికారులు వివరణ ఇచ్చారు. దీంతోపాటు స్విమ్స్ ఆస్పత్రిని కూడా ఇందులో భాగస్వామ్యం చేయాలని సీఎం జగన్ అధికారులకు సూచించారు. కొత్తగా ఏర్పాటు చేసే 16 మెడికల్ కాలేజీలతో కలిపి 27 మెడికల్ కాలేజీల్లో కూడా క్యాన్సర్ నివారణకు రెండేసి చొప్పున లైనాక్ మెషిన్లు ఉండేలా బ్లూ ప్రింట్ ఇవ్వాలని సీఎం చెప్పారు. ఇందులో మూడు కాలేజీల్లో సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ ఏర్పాటుకు నిర్ణయం తీసుకున్నారు. విశాఖ, తిరుపతి, గుంటూరులో క్యాన్సర్ నివారణపై సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ పెట్టాలని ప్రతిపాదించారు. పూర్తిస్థాయి ప్రతిపాదనలు సిద్ధంచేసి నివేదిక సమర్పించాలని అధికారులను సీఎం ఆదేశించారు. ఈ సమీక్షా సమావేశంలో వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజని, సీఎస్ సమీర్ శర్మ, వైద్య ఆరోగ్యశాఖ ముఖ్యకార్యదర్శి ఎం టీ కృష్ణబాబు, వైద్య ఆరోగ్యశాఖ ముఖ్య కార్యదర్శి(కోవిడ్ మేనేజిమెంట్ అండ్ వ్యాక్సినేషన్) ముద్దాడ రవిచంద్ర, ఆరోగ్యశాఖ స్పెషల్ సెక్రటరీ జీఎస్ నవీన్ కుమార్, ఆరోగ్యశ్రీ సీఈఓ వి.వినయ్ చంద్, ఏపీఎంఎస్ఐడీసీ వీసీ అండ్ ఎండీ డి. మురళీధర్ రెడ్డి, ఏపీవీవీపీ కమిషనర్ వి. వినోద్ కుమార్, వైద్య ఆరోగ్యశాఖ డైరెక్టర్ (డ్రగ్స్) రవిశంకర్ ఇతర ఉన్నతాధికారులు హాజరయ్యారు.

## పవన్ 'కౌలు రైతుల భరోసా యాత్ర'

అమరావతి: జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ కౌలు రైతు కుటుంబాలను ఆదుకోనున్నారు. ఆయన 'కౌలు రైతుల భరోసా యాత్ర' చేపడుతున్నారు. ఈ కార్యక్రమానికి పవన్ రూ. 5 కోట్ల సొంత డబ్బును విరాళంగా ఇవ్వగా..తమ వంతుగా పవన్ కళ్యాణ్ కుటుంబ సభ్యులు రూ.35 లక్షల విరాళం ప్రకటించారు. ఈ మేరకు వారు పవన్‌కు చెక్కులు అందజేశారు. ఈ మొత్తాన్ని కౌలు రైతుల భరోసా యాత్ర ప్రత్యేక నిధిగా జనసేన పార్టీ ముఖ్య నాయకుడు నాదెండ్ల మనోహర్ ప్రకటించారు. హీరో వరుణ్ తేజ్ రూ.10 లక్షలు, సాయిధరమ్ తేజ్ రూ.10 లక్షలు, వైష్ణవ్ తేజ్ రూ.5 లక్షలు, నిహారిక రూ.5 లక్షలు ఇచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా రైతు కుటుంబాలకు అండగా నిలిచేందుకు స్పందించిన దాతలకు పవన్ కళ్యాణ్, నాదెండ్ల మనోహర్ కృతజ్ఞతలు తెలిపారు.



## రామగిరిలో సునీతను అడ్డుకున్న పోలీసులు



సత్యసాయి జిల్లా : మాజీ మంత్రి పరిటాల సునీతను పోలీసులు అడ్డుకున్నారు. పుట్టపర్తి వెళ్లకుండా ఆమె కారును రామగిరిలో పోలీసులు నిలిపివేశారు. పరిటాల సునీతతోపాటు ఆమె తనయుడు పరిటాల శ్రీరామ్ పుట్టపర్తికి వెళ్లేది లేదని అడ్డగించారు. రైతు సమస్యలపై కలెక్టరేట్ ముట్టడికి టీడీపీ పిలుపునిచ్చింది. ఈ మేరకు వారు పలువురు టీడీపీ నాయకులతో కలిసి పుట్టపర్తి వెళ్తున్నారు. అయితే వీరిని మార్గమధ్యంలోనే పోలీసులు అడ్డుకున్నారు. పుట్టపర్తి వెళ్లనీయకుండా తమను అడ్డుకోవడంపై పరిటాల సునీత పోలీసులపై ఆగ్రహం వ్యక్తం చేశారు.రైతుసమస్యలపై నిరసన వ్యక్తం చేసేందుకు వెళుతుంటే ఎందుకు అడ్డుకుంటున్నారని సునీత పోలీసులను సూటిగా ప్రశ్నించారు. అయితే పరిటాల శ్రీరామ్, పరిటాల సునీతలు కలిసి ఒకే వాహనంలో వెళ్లేందుకు అనుమతి స్తామని, కాన్వాయ్‌ను అనుమతించ బోమని పోలీసులు స్పష్టంచేశారు. ఒక వాహనం వెళ్లేందుకే అనుమతి ఉన్నదని పోలీసులు తెలిపారు. ఇదేమైనా నియంత రాజ్యమా అంటూ పోలీసులపై సునీత మండిపడ్డారు. పోలీసులు అడ్డుకున్న వినకుండా సునీత, శ్రీరామ్ బారికేడ్లు దాటుకుని ముందుకు వెళ్లారు. ఇలాఉండగా, అనంతపురంలో మాజీ ఎమ్మెల్యే ప్రభాకర చౌదరిని హౌస్ అరెస్ట్ చేశారు. ప్రజల పక్షాన పోరాటం చేస్తుంటే పోలీసులను పెట్టి అణచివేయాలని చూడటం చాలా దుర్మార్గమన్నారు. టీడీపీ పిలుపు మేరకు రెండు జిల్లాల కలెక్టరేట్ల వద్ద పోలీసులుభారీగామోహరించారు. కలెక్టరేట్ వైపు వాహనాలు వెళ్లకుండా చూశారు. కలెక్టరేట్ దారులన్నింటినీ బారికేడ్లతో మూసివేశారు. కలెక్టరేట్లలోకి వెళ్లే వారిని తనిఖీ చేసి పోలీసులు మరీ పంపించారు.

## ఏపీ లో అరాచక పాలన నడుస్తోంది: నారా లోకేష్



అమరావతి: ఏపీ లో అరాచక పాలన నడుస్తోందని టీడీపీ నేత నారా లోకేష్ ధ్వజమెత్తారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ జగన్ రాష్ట్రంపై పడి ప్రజాధనం దోచుకుంటుంటే.. వైసీపీ నేతలు గ్రామాలపై పడుతున్నారని మండిపడ్డారు. హిందూ దేవాలయాలపై వైసీపీ ముఠాలే దాడులు చేసి.. టీడీపీపై ఆరోపణలు చేస్తున్నారని దుయ్యబట్టారు. ప్రకాశం జిల్లాకు చెందిన చోటా వైసీపీ నేత వెంకటేశ్వరరెడ్డి ఇంట్లో రూ.25కోట్ల విలువైన మరకత విగ్రహం బయటపడిందన్నారు. వైసీపీ బడా నేతల ఇళ్లల్లో ఇంకెన్ని పురాతన విగ్రహాలున్నాయో? అని ప్రశ్నించారు. రాష్ట్రంలోని అన్ని దేవాలయాల్లోనూ వైసీపీ నేతలు.. నగలు, విగ్రహాలు ఎత్తుకెళ్లారని భక్తుల్లో అనుమానాలున్నాయని లోకేష్ తెలిపారు.

## కరోనా డేంజర్ బెల్స్

### 50 వేలకు చేరువలో యాక్టివ్ కేసులు

న్యూఢిల్లీ కరోనా మహమ్మారి ఇప్పట్లో అంతమయ్యేలా కనిపించడం లేదు. కరోనాను జనం తేలిగ్గా తీసుకుంటుండంతో మళ్లీ కేసులు పెరుగుతున్నాయి. జూలైలో కేసులు పీక్స్‌కు చేరనున్నట్లు, మరో ఆరు నెలలు జాగ్రత్తగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు. బహిరంగ ప్రదేశాల్లో మాస్కులు ధరించాలని చెబుతున్నారు. భారత్‌లో కేసుల నమోదు చూస్తుంటే కోవిడ్ నాలుగో వేవ్ దగ్గరికి వచ్చినట్లే కనిపిస్తోంది.గడిచిన 24 గంటల్లో దేశంలో 8,084 కరోనా కేసులు నమోదయ్యాయి. దీంతో మొత్తం కేసులు



4,32,30,101కు చేరాయి. ఒక్క రోజే 10 మంది మరణించడంతో ఇప్పటి వరకు ప్రాణాలు కోల్పోయిన వారి సంఖ్య 5,24,771కు చేరింది. ఇక దేశంలో యాక్టివ్ కేసుల సంఖ్య 50 వేలకు చేరువగా ఉన్నాయి. ప్రస్తుతం 47,995 యాక్టివ్ కేసులున్నాయి. నిన్న 4,592 మంది కోలుకున్నారు. ఈ మేరకు కేంద్ర వైద్యారోగ్యశాఖ అధికారులు సోమవారం హెల్త్ బులిటెన్ విడుదల చేశారు.దీని ప్రకారం కొత్తగా నమోదైన కేసుల్లో అత్యధికంగా మహారాష్ట్రలో 2946 కేసులు ఉన్నాయి. కేరళలో 4319, ఢిల్లీలో 735, కర్ణాటకలో 463, హర్యానాలో 304 నమోదయ్యాయి.ఇక యాక్టివ్ కేసులు 0.11 శాతానికి చేరాయి. రికవరీ రేటు 98.68 శాతం, మరణాలు 1.21 శాతంగా ఉన్నాయి. రోజువారీ పాజిటివిటీ రేటు 3.24 శాతానికి చేరింది. ఇప్పటివరకు 1,95,19,81,150 కరోనా వ్యాక్సిన్ డోసులను పంపిణీ చేశామని ఆరోగ్యశాఖ వెల్లడించింది. ఆదివారం ఒక్కరోజే 11,77,146 మందికి వ్యాక్సినేషన్ చేశామని పేర్కొంది.

## టీడీపీ నేత ధూళిపాళ్ల నరేంద్రకు చేదు అనుభవం

గుంటూరు: టీడీపీ నేత ధూళిపాళ్ల నరేంద్రకు చేదు అనుభవం ఎదురైంది. అక్రమంగా మైనింగ్ జరుగుతుందంటూ మీడియాను తీసుకొని పెదకాకాని మండలం అనుమర్లపూడికి వెళ్లిన దూళిపాళ్లను అక్కడి గ్రామస్తులు అడ్డుకున్నారు. అనుమతితో మట్టి తవ్వుతుంటే అక్రమ క్వారీ అంటూ తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. గొడవ పెట్టేందుకే ఇక్కడకు వచ్చారా అంటూ దూళిపాళ్లను నిలదీశారు. టీడీపీ హయాంలో ఈ ప్రాంతంలో అంతులేని అక్రమాలు చేశారని ఇప్పుడు ఏ మొహం పెట్టుకుని ఇక్కడకు వచ్చారంటూ గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం? చేశారు.



## జగన్ కు చంద్రబాబు లేఖ

అమరావతి: సీఎం జగన్ )కు టీడీపీ అధినేత చంద్రబాబు (లేఖ రాశారు. ఏపీపీఎస్సీ నోటిఫికేషన్ల జారీలో జాప్యంపై లేఖలో చంద్రబాబు ప్రస్తావించారు. ఏటా జనవరిలో జాబ్ క్యాలెండర్ హామీ ఏమైందని ప్రశ్నించారు. ప్రభుత్వ హామీ దృష్ట్యా మూడేళ్లుగా యువత ఎదురుచూపులు చూస్తున్నారని తెలిపారు. గ్రూప్-1 ఎంపిక తీరుపట్ల అభ్యర్థుల్లో తీవ్ర ఆందోళన ఉందన్నారు. అడుగడుగునా అవకతవలకు పాల్పడ్డారని అభ్యర్థుల ఆరోపిస్తున్నారని తెలిపారు. అస్మదీయుల కోసం గ్రూప్-1లో అక్రమాలకు తెరతీశారని ఆరోపించారు. రెండుసార్లు విడుదల చేసిన ఫలితాల్లో తేడాతో అభ్యర్థుల్లో ఆందోళనకు గురయ్యారని తెలిపారు. విచారణ జరిపి అర్హులైన అభ్యర్థులకు న్యాయం చేయాలని లేఖలో చంద్రబాబు డిమాండ్ చేశారు.



# సంపాదకీయం

మంగళవారం, 14-06-2022

## ప్రతి గంటకు ఇద్దరు మహిళలపై అత్యాచారాలు.. ఫుల్ స్టాప్ ఎప్పుడు

తల్లిదండ్రులు సంపాదన పైన ధ్యాస పెట్టి పిల్లలను పట్టించుకోకపోవడంతో వారు అదుపు తప్పి ప్రవర్తించడం జరుగుతుంది. కొన్ని సహస్రాబ్దాలుగా భారతదేశంలో మహిళల పాత్ర అనేక గొప్ప మార్పులకు లోనౌతూ వచ్చింది. ప్రాచీన కాలం నుండి నేటి కాలం వరకు మహిళలు ఎన్నో అత్యున్నత పదవులను అలంకరించినా సాధికారత సాధ్యం కావడం లేదు, లైంగిక హింసను నిరోధించడంలో ప్రభుత్వాలూ విఫలమవుతున్నాయి. కఠిన చట్టాలు. పేదోడికి ఒక రకంగా, అంగ బలం. అధికార బలం ఉన్నోడికి మరో రకంగా పనిచేస్తున్నాయి, నిర్భయ. దిశ. పొక్సో చట్టాలు ఉన్నప్పటికీ మహిళా మణుల రక్షణ నేటికీ అగమ్యగోచరంగా ఉన్నది.నేటి ఆధునిక యుగంలో సృష్టికి ప్రతిరూపంగా భావించే మహిళలు సామాజికంగా, రాజకీయంగా, ఆర్థికంగా, విద్యా, ఉద్యోగపరంగా అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారు. కొందరు మాత్రమే అంతరిక్షయానం దాకా ఎదుగుతున్నారు. ఎక్కువ శాతం మంది వంటింటిలోనే మగ్గుతున్నారు. అత్యాచారాలు, లైంగిక వేధింపులు, గృహహింస రోజురోజుకూ ఎక్కువవుతూనే ఉన్నాయి. ఒకప్పుడు లక్ష్మి దేవతగా పూజించబడిన మహిళ నేడు అంగడిలో సరుకుగా మారిపోతున్న దుస్థితి. ఆత్మనూన్యతతో వారు ఆత్మహత్య చేసుకుంటున్న పరిస్థితులను చూస్తున్నాం. నిర్భయ, దిశ లాంటి ఎన్ని కఠిన చట్టాలు వచ్చినా దాడులు మాత్రం ఆగడం లేదు. ఆడపిల్లలు బయటకు వెళ్లి క్షేమంగా తిరిగి రాలేని భయానక పరిస్థితి నేడు దేశంలో నెలకొంది.ప్రతి గంటకు ఇద్దరు మహిళలు అత్యాచారానికి గురి కావడం దేశంలో నెలకొన్న పరిస్థితి ఎంత తీవ్రంగా ఉందో చెప్పకనే చెబుతోంది. అధికారిక లెక్కల ప్రకారం ప్రతి 26 నిమిషాలకు ఒక మహిళ వేధింపులకు గురవుతోంది. ప్రతి 34 నిమిషాలకు అత్యాచారం జరుగుతోంది. ప్రతి 42 నిమిషాలకు లైంగిక వేధింపులకు, ప్రతి 99 నిమిషాలకు వరకట్నం వేధింపులకు ఒకరు బలి అవుతున్నారు. యేటా మహిళలపై నేరాల సంఖ్య క్రమంగా పెరిగి వారికి రక్షణ లేకుండా పోతోంది. గ్రామాలలో సైతం విచక్షణరహితంగా సభ్యసమాజం తలదించుకునేలా వయసుతో నిమిత్తం లేకుండా దాడులు జరుగుతున్నాయి. ప్రభుత్వం వాటిని నివారించడానికి తీసుకుంటున్న చర్యలు మాత్రం పెద్దగా ప్రభావం చూపడం లేదన్నది వాస్తవం.రాష్ట్రంలో గత ఎనిమిది సంవత్సరాలుగా అత్యాచారాల సంఖ్య ఏడు రెట్లు పెరిగింది. అత్యాచార కేసులలో 12 నుంచి 17 సంవత్సరాల మధ్య వయసున్న బాలికలే ఎక్కువగా ఉన్నారని పోలీసు లెక్కలు చెబుతున్నాయి. గత ఏడాది పోక్సో చట్టం కింద 2,356 కేసులు నమోదు అయ్యాయి. ఇక పరువు కోసం ఆలోచించి పోలీసుల ముందుకు రాని కేసుల సంఖ్య పది శాతం దాకా ఉండవచ్చు. రాష్ట్ర రాజధానిలో దేశంలో ఎక్కడా లేని విధంగా సీసీ కెమెరాలు ఉన్నాయి. ప్రపంచస్థాయి రక్షణ ఉందని, చీమ చిటుక్కుమన్నా తెలిసిపోతుందని చెప్పిన మాటలు నిజం కాదని తేలిపోయింది. అత్యాచార కేసులలో 98 శాతానికి పైగా నిందితులు బాధితులకు తెలిసినవారే. 90 శాతం నేరాలు మద్యం, మత్తు పదార్థాలతోనే జరిగాయని పోలీసు రికార్డులు చెబుతున్నాయి. అడ్డూ అదుపు లేని పబ్ కల్చర్, వీకెండ్ ఈవెంట్స్, బర్త్ డే పార్టీలలో విచ్చలవిడిగా దొరుకుతున్న మద్యం, డ్రగ్స్ వలన యువత చెడు మార్గంలో నడుస్తున్నారు. సోషల్ మీడియా విచ్చలవిడి వాడకంతో అమాయక బాలికలను ట్రాప్ చేసి అఘాయిత్యాలకు పాల్పడుతున్నారు. రాష్ట్ర ఆదాయం పెంచుకోవడం కోసం ఎన్నో మద్యం దుకాణాలకు పర్మిషన్ ఇచ్చారు. దీంతో నేరాలు ఎక్కువయ్యాయి. మైనర్ల విషయంలో పోలీసుల కంటే తల్లిదండ్రుల బాధ్యత కీలకం. లింగ వివక్ష పట్ల తల్లిదండ్రుల వ్యవహారశైలి మగ పిల్లాడికి అలుసుగా మారే అవకాశం ఉంటున్నది. ఫలితంగా మగాడు తనను గొప్పగా ఊహించుకొని సమాజంలో అసభ్యకరంగా ప్రవర్తించుతున్నాడు.కొందరు తల్లిదండ్రులు సంపాదన పైన ధ్యాస పెట్టి పిల్లలను పట్టించుకోకపోవడంతో వారు అదుపు తప్పి ప్రవర్తించడం జరుగుతుంది. కొన్ని సహస్రాబ్దాలుగా భారతదేశంలో మహిళల పాత్ర అనేక గొప్ప మార్పులకు లోనౌతూ వచ్చింది. ప్రాచీన కాలం నుండి నేటి కాలం వరకు మహిళలు ఎన్నో అత్యున్నత పదవులను అలంకరించినా సాధికారత సాధ్యం కావడం లేదు, లైంగిక హింసను నిరోధించడంలో ప్రభుత్వాలూ విఫలమవుతున్నాయి. కఠిన చట్టాలు. పేదోడికి ఒక రకంగా, అంగ బలం. అధికార బలం ఉన్నోడికి మరో రకంగా పనిచేస్తున్నాయి, నిర్భయ. దిశ. పొక్సో చట్టాలు ఉన్నప్పటికీ మహిళా మణుల రక్షణ నేటికీ అగమ్యగోచరంగా ఉన్నది.

# బొంగులో చికెన్‌కు క్రేజ్



విశాఖపట్టణం, జూన్ 13, బొంగులో చికెన్‌కు ఎంత క్రేజ్ ఉందో ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. సహజంగానే మన దగ్గర మాంస ప్రియులు ఎక్కువ. ఎక్కడైనా టేస్టీ నాన్‌వెజ్ దొరికితే, అస్సలు వదిలిపెట్టరు. వెరైటీ వంటకాలు, మసాలా ఐటమ్స్‌కు స్పెషల్ ఫ్యాన్స్ ఉన్నారు. నాన్-వెజ్ లవర్స్ అస్సలు వదిలిపెట్టలేని వెరైటీ డిష్ మన బొంగులో చికెన్. వెరైటీ వంటకాలకు కేరాఫ్ అడ్రస్‌గా ఉన్న విశాఖ మన్యంలో ఇది బాగా పాపులర్. విశాఖ జిల్లా ఏజెన్సీ ప్రాంతాల్లో బొంగు చికెన్ ఎంత ఫేమస్ అయ్యిందంటే, అరకు టూర్‌కు వెళ్లిన వారు బొంగు చికెన్ తినకుండా తిరిగిరారు. మాంస ప్రియులను ఇది అంతలా ఆకట్టుకుంది. అటు, తూర్పుగోదావరి జిల్లాలోని అటవీ ప్రాంతం, తెలంగాణ ఖమ్మం జిల్లాలోని కొన్ని గిరిజన ప్రాంతాల్లోనూ ఈ బొంగులో చికెన్ దొరికేది. కేవలం బొంగులో చికెన్ తినడానికే ఈ ప్రాంతాలకు వెళ్లేవారు ఎంతో మంది ఉన్నారు. కానీ, ఇప్పుడీ బొంగులో చికెన్ వైజాగ్ సిటీలోనే దొరుకుతుంది. అదే రుచి, అదే క్వాలిటీతో, ఏమాత్రం తగ్గకుండా ఎంజాయ్ చేస్తున్నారు ఫుడ్ లవర్స్. ఆహా ఏమి రుచి.. తినరా మైమరచి అని మురిసిపోతున్నారు.ఓ గిరిజన కుటుంబం ఏజెన్సీ నుంచి బొంగులు తీసుకువచ్చి, ఈ టేస్టీ చికెన్ చికెన్‌ను సిటీలోని నాన్-వెజ్ ప్రియులకు అందిస్తుంది. కేజీ 600, అర కేజీ 300, పావు కేజీ 150 లెక్కన అమ్ముతున్నారు. ఈ బొంగులో చికెన్ వ్యాపారం మీదే ఆధారపడి విశాఖ ఏజెన్సీలో ఎన్నో కుటుంబాలు జీవిస్తున్నాయి. తాజాగా, వారు విశాఖ సిటీలోనూ అమ్మడం ప్రారంభించి, ఫుడ్ లవర్స్‌కు కేరాఫ్ అడ్రస్‌గా మారారు. ఈ బొంగులో చికెన్‌ను వంటపాత్రల్లో కాకుండా అడవిలో లభించే వెదురు బొంగులో వండుతారు. దీన్ని తయారు చేయడం చాలా సులభం. ముందుగా చికెన్‌ను శుభ్రంగా కడిగి, దానికి తగినంత అల్లం వెల్లుల్లి పేస్ట్, ఉప్పు, కారం, గరం మసాలా, చికెన్ మసాలా దట్టించాలి. తర్వాత కొన్ని నీళ్లు పోసి కలిపి, వెదురు బొంగులో పెట్టాలి. రెండు వైపులా ఆకులు కప్పి, మంటపై 20 నిమిషాలు వరకు కాల్చాలి. వెదురులో ఉండే సహజమైన నీటి ఆవిరికి మాంసం ఉడకడంతో, రుచి మాములుగా ఉండదు. మరో ప్రత్యేకత ఏంటంటే, దీంట్లో వంట నూనె వాడరు. అత్యంత రుచికరమైన ఈ వంటకాన్ని తయారుచేయడం కొంతమంది గిరిజనులకే సాధ్యం.విశాఖ మన్యం అరకులోయ నుంచి మారేడుమిల్లి వరకు ఉన్న పర్యాటక ప్రాంతాల్లో మాత్రమే ఈ బొంగులో చికెన్ విరివిగా దొరకుతుంది. అక్కడి గిరిజనులు ఎంతో మనసుపెట్టి వండి.. పర్యాటకులకు ఈ డిష్ అందిస్తారు. అక్కడి చిక్కటి అటవీ ప్రాంతంలో.. ఈ వెచ్చటి చికెన్ తింటుంటే ఆ ఫీలింగ్ వేరు. ఆయా ప్రాంతాలకు వెళ్లివచ్చినవారు, పక్కాగా బొంగులో చికెన్ గురించి ప్రస్తావిస్తారు. అంతలా జనాల్ని ఫిదా చేసింది ఈ బొంగులో చికెన్. తాజాగా, ఇది వైజాగ్ సిటీలోనే ఈ స్పెషల్ డిష్ దొరకుతుండటంతో నాన్-వెజ్ లవర్స్ ఫుల్ హ్యాపీగా ఉన్నారు. ఇది సూపర్ టేస్ట్ ఉండటమే కాకుండా, ఆరోగ్యానికి కూడా ఎంతో మేలు చేస్తుందని చెబుతున్నారు. నాన్‌వెజ్ లవర్స్.. బొంగులో చికెన్‌ను మీరు కూడా ఓసారి ఎంజాయ్

# మద్యమే ఆదాయం...

విజయవాడ, జూన్ 13, వెయ్యి అంటాం.. అన్నీ చేస్తామా.. అవసరార్థం ఏదో అంటాం.. అపరాధం శమించుగాక అనీ మళ్లీ అదే మాట వెనక్కి తీసుకుంటాం.. చేయకూడదా.. అర్థంచేసుకోరూ..!! వెనకటికి ఒక స్వాములారు ఈ ఏడాది కొంప కూలేట్టు వర్షాలు పడతాయన్నారు. తీరా చూస్తే పడలేదు. తర్వాత ఆయనే దేవుడు శపించాడని చెప్పి పారిపోయాడు!ఇలా జరుగుతుంటాయి. కాదన్నది, ఇప్పుడు అవసరమయింది జగన్ ప్రభుత్వానికి. తప్పేముంది అంటే తప్పేమరి! మద్యం మత్తులో అన్యాయాలు జరుగుతున్నాయి. సమాజంలో దారుణాలు జరుగుతున్నాయని ప్రభుత్వం భావించి మద్యం నిషేధించడానికి దీప ప్రమాణం చేసి కంకణం కట్టుకున్నారు. అప్పుడు అది తప్పనిసరి. అసలు ప్రభుత్వానికి మద్యం అమ్మకాలే కోట్లలో డబ్బు కుమ్మరిస్తుందన్నది తెలిసినదే. కాబోతే రాష్ట్ర ప్రజల ఆరోగ్యం కంటే కోట్లు ప్రధానం కాదనుకున్నవారు నిషేధాన్ని గురించి భారీ ప్రచారాలు చేసేరు.కొంత సమయం గడిచేక ఒర్నాయనో, అదే మంచి రూటు అనిపించి వుండవచ్చు. ప్రభుత్వం మద్యం అమ్మకాలను కట్టుదిట్టంగా అమలుచేయడానికి సంకల్పించింది. ఎక్కడపడితే అక్కడ కాకుండా దానికీ ఓ లెక్క వుండాలన్నది. అందుకే దుకాణాల దగ్గర గొడవలు కాకుండా ఒక పద్ధతి ప్రకారం అమ్మకాలు జరగాలని కాపాలా దారులను ఏర్పాటు చేసింది. వారిలో దురదృష్టవశాత్తూ కొందరు టీచర్లూ పహారా పనుల్లో వుండడం విపక్షాల కంటపడి ఆ సంగతి రచ్చకెక్కింది. కరోనా కారణంగా అన్ని రంగాలు దాదాపు కుదేలయ్యాయి.ఆదాయమార్గాలు దాదాపు మూసుకుపోయాయి. అప్పులు చేయాల్సిన పరిస్థితులు తలెత్తాయి. అప్పులతోనే కాపురం కొనసాగించడమూ కష్టమే. ఎన్నాళ్లిలా సాగుతుంది పాలన. అందుకే మద్యానికి మళ్లీ పొర్లే అవకాశం ఇచ్చేరు. వేల కోట్లు వచ్చిపడే వీలున్నదాన్ని కాదు పొమ్మంటే అసలుకే ఎసరు అవుతుంది.అందుకే ఓకే అనేసేరు. మరి గత ప్రమాణాలు, బోధల మాటేమిటని అడిగినా సమాధానం చెప్పే స్థితిలో ప్రభుత్వం లేదు. ధనార్జన అవసరం. అందుకోసం గతంలో చెప్పిన మాటలు నీటి మూటలుగానే మారిపోవడం చేసి చూపారు. పరిస్థితులు ఒకేలా వుండాలని లేదు. వుంటాయనుకోవడం, తన మాటను తానే వెనక్కు తీసుకోవాల్సి వస్తుందా అని అనుకోవడమే భ్రమ. ఒక్కోసారి పరిస్థితుల ప్రభావంతో మాటలు

చేతలు వెనక్కి తీసుకోవాల్సి వస్తుంది మరి! అదే ఇప్పుడు జగన్ కూడా చేసేడు. నాలుకను ఎలాగయినా మడతబెట్టవచ్చు. గతంలో చంద్రబాబు నాయుడు అమరావతి అభివృద్ధి కార్పోరేషన్ బాండ్లు అమ్మి రెండువేల కోట్లు అభివృద్ధి కోసం అప్పు తెచ్చారు. ఇప్పుడు జగన్ సర్కార్ బేవరేజ్ కార్పొరేషన్ బాండ్లు అమ్మి ఎనిమిదివేల కోట్లు అప్పు తెచ్చుకుంది. పరిస్థితులు చేజారిపోతుంటే మరి వొంట్లో వొణుకు వస్తుందిగదా! ప్రగల్భాలకి ఇపుడు ఆస్కారం లేదు. అందుకే మద్యనిషేధానికి బ్రేక వేస్తూ ఇది తాత్కాలికం, పాక్షికం అంటూనే ఏపీ లిక్కర్ బాండ్లపై 9.62 శాతం వడ్డీకి 8 వేలకోట్లు అప్పు తెచ్చింది. ఇండియా రేటింగ్స్ సంస్థ బేవరేజెస్ కార్పోరేషన్‌కు ఏఏ రేటింగ్ ఇవ్వడం చిత్రం. ఎందుకంటే మద్యం విధానం మార్చబోమని దీప ప్రమాణం చేసిన తర్వాతనే ఈ రేటింగ్ రావడం అందర్నీ ఆశ్చర్యపరిచింది. అందుకు ఎవరికి ఎంత ముట్టచెప్పారన్నది తేలాల్సిన ప్రశ్న.

# గన్నవరంలో వీధి పోరాటాలు

విజయవాడ, జూన్ 13,ఇంటి గుట్టు గుట్టుగా వున్నంతవరకే, గుట్టు రచ్చకెక్కితే ఇంటి పరువు బజారుకెక్కుతుంది. రాజకీయాల్లో పరువుతో పాటు స్థానభ్రంశం కూడా జరగవచ్చు. ఇపుడు వైసీపీ పరిస్థితి ఇదే. జగన్ సారథ్యం ఆహా..ఓహో అనుకున్నారంతా. క్రమేపీ అసలు రంగు ఇపుడు బయటపడుతోంది. మొన్నటిదాకా అంతా చక్కగా నవ్వు తూ కలిసి పనిచేస్తున్నట్టు కేవలం కనిపించారనే అనాలి. ఇపుడు పరిస్థితులు అనుకూలించడమూ లేదు. పార్టీ విధానాలు, పథకాల అమలు అన్నింటా జగన్ ప్రభుత్వం ఫెయిల్ అయింది. మంత్రులు, ఎమ్మెల్యే లు ప్రజల ముందు నిలిచి గట్టిగా ఏ పథకం గురించి మాట్లాడి నిలిచే స్థితిలో లేరు. దీనికి తోడు వారిలో వారికి అస్సలు పడటం లేదు. ఈ గొడవలు అంతకు ముందు నుంచీ వున్నా, ఇపుడు తెర మీదకి వస్తు న్నాయి. మంత్రులు, ఎమ్మెల్యేలకు క్లాస్ తీసుకుందామని పెట్టిన ప్రత్యేక సమావేశంలో వారి మధ్య విభేదాలు బయట పడ్డాయి. అంతేకాదు అధిష్టానం మీద కూడా ఒంటికాలి మీద లేచేందుకు కూడా మం త్రులు, ఎమ్మెల్యేలు వెనుకాడలేదు. మీరు సరిగా చేయలేదంటే మీరు సరిగా లేరన్నారు. మొన్న మచిలీపట్నం నియోజకవర్గం మాజీ మంత్రి పేర్ని నాని, ఎంపీ బాలశౌరి మధ్య విభేదాలు బట్ట బయలయినాయి. ఇపుడు లేటెస్ట్‌గా గన్నవరం గొడవలు సీఎం జగన్ దాకా వెళ్లాయి. అక్కడ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ మోహన్, వైసీపీ సీనియర్ నాయకుడు వెంకటేశ్వర రావు మధ్య విభేదాలు రోడ్డెక్కాయి.వల్లభనేని వంశీ టిడిపీ నుంచి వైసీపీలోకి వచ్చినప్పటి నుంచి వీరిద్దరి మధ్యా విభేదాలు వుంటూనే వున్నా యి. అయితే అవి చుట్టుపక్కలవారికి తప్ప అధిష్టానం చెవికి చేరలేదు.నియోజకవర్గంలో అందరికీ చేదోడు వాదోడుగా వుంటున్న తనను వంశీ అప్రతిష్టపాలు చేస్తున్నారని వాపోయారు. వ్యక్తిగత పనులపై యార్లగడ్డ ఆరు నెలలు అమెరికా వెళ్లారు. ఆ సమయంలో తనపై దుష్ప్రచారం చేశారని యార్లగడ్డ ఆరోపణ. సీఎం జగన్ కెడిసిసి ఛైర్మన్ పదవిని యార్లగడ్డకు ఇచ్చారు. ఎంతో కష్టపడి, ఎన్నో సంస్కరణలు తెచ్చి 43 శాతం అభివృద్ధి చేసిన తనను జగన్ దృష్టిలో తక్కువ చేసేవిధంగా వ్యవహరించడం వంశీకే చెల్లిందన్నారు. అసలే అన్నివైపుల నుంచీ సమస్యలతో సతమతమవుతున్న జగన్ ప్రభుత్వానికి ఎమ్మెల్యేలు, మంత్రుల మధ్య ఇలాంటి వివాదాలు మరింత ఇబ్బందికరంగా మారాయి. విభేదాలు చర్చించుకుని

ప్రభుత్వ పథ కాల ప్రచారంలో గట్టి కృషి చేయాలని జగన్ నెత్తినోరు కొట్టుకుంటున్నా పార్టీలో సీనియర్లు ఇలా గొడవ పడుతూండడం జగన్‌కు తలభారంగా మారింది.వంశీమోహన్ చేస్తున్న ఆరోపణల్లో నిజంలేదని తాను ఎలాంటి విచారణకయినా సిద్ధమంటున్నారు యార్లగడ్డ వెంక్రటావు. మట్టి తవ్వడం డబ్బుచేసుకోవడం వంటి ఆరోపణలు అర్ధరహితం. తాను నియోజకవర్గ ఇన్‌ఛార్జి గా వున్నపుడు ఒక్క పైసా అవినీతికి పాల్పడ లేదని, అవసరమయితే దేవుని వద్ద ప్రమాణం చేయడానికీ సిద్ధమని అన్నారు. అంటే నియోజక వర్గంలో వంశీ మోహన్, వెంకట్రావు మధ్య విభేదాలు ఏస్థాయికి చేరుకున్నదీ తెలుస్తుంది. వచ్చే ఎన్నికల్లో ఎక్కడ నుంచి పోటి చేస్తారు. ఏ పార్టీ నుంచి బరిలో దిగుతారని నా పై ఇంతమంది ప్రచారం చేస్తున్నారు కాబట్టే నా ఇమేజ్ బాగా పెరిగింది అనుకుంటున్నాని యార్లగడ్డ వెంకట్రావు అన్నారు.ఈ విభేదాలు, తగాదాలు, గొడవల నేపథ్యంలో వైసీపీలో కీలకవ్యక్తులను, అభిమానులను ఒకే తాటి మీద నడిపించడం బహుకష్టమే. ఎన్నికలు ఆట్టే దూరంలో లేని ఈ సమయంలో పార్టీ పటిష్టంగా వ్యూహాత్మకంగా ముందడుగు వేయాల్సిందిపోయి తమ్ముళ్ల మధ్య తగాదాలు, అభిమానుల వీధిపోరాటాల పరిష్క రణ కార్యక్రమాలే జగన్ రెడ్డికి ప్రస్తుతం అత్యంత ప్రధాన కార్యక్రమమయింది.

# అతిసార వ్యాధి పట్ల ప్రజలు జాగ్రత్తలు పాటించాలి

### కోటికేశవరం హాస్పిటల్ డాక్టర్ పుణ్యశాంతి

గోకవరం, అతిసార వ్యాధి పట్ల ప్రజలు చాలా జాగ్రత్తలు పాటించాలని, ఆరోగ్య సిబ్బంది అన్ని విషయాలు వివరిస్తారని, ప్రభుత్వం ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేస్తుందని డాక్టర్ పుణ్యశాంతి అన్నారు.. సోమవారం కోటికేశవరం ప్రభుత్వ హాస్పిటల్ పరిధిలో అతిసార నియంత్రణ పక్షోత్సవాలు కార్యక్రమం నిర్వహించారు.. అన్ని గ్రామాల్లో వైద్య, ఆరోగ్య సిబ్బంది కార్యక్రమాలు చేపట్టారు.. కోటికేశవరం అంగన్వాడీ కేంద్రాల్లో చిన్నారులను డాక్టర్ పుణ్యశాంతి పరీక్షించారు.. చిన్న పిల్లల విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు.. ఈ సందర్భంగా డాక్టర్ పుణ్యశాంతి మాట్లాడుతూ, డయేరియా నియంత్రణ కార్యక్రమం 15 రోజుల పాటు జరుగుతుందని, అన్ని గ్రామాల్లో దీనికి సంబంధించి వివరాలు సిబ్బంది వివరిస్తారని అన్నారు..అయిదు సంవత్సరాలు లోపు చిన్నారుల విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని అన్నారు. అతిసార వ్యాధి సోకితే బాగా నీరసంగా ఉంటారని, ఓఆర్ఎస్ పాకెట్ తాగితే నీరసం తగ్గుతుందని అన్నారు.. ఒక ఓఆర్ఎస్ పాకెట్ లో లీటర్ గోరు వెచ్చని నీళ్లు కలుపుకుని తాగాలి అన్నారు.. అలాగే ప్రతి ఒక్కరు ఇంటి

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, కాచి చల్లార్చిన నీటిని వాడాలని, కలుషిత నీరు వల్ల అతిసార వ్యాధి వస్తుందని అన్నారు..బాగా ఉడికించిన వాటినే ఆహారంగా తీసుకోవాలని, సరిగా ఉడకని పదార్థాలు తినకూడదని చెప్పారు.. ఓఆర్ఎస్ ప్యాకెట్లు అవసరమైన వారు మీ సమీపంలో ఆరోగ్య సిబ్బందిని అడిగి తీసుకోవచ్చని అన్నారు..

## ఆత్మకూరులో ఏడుగురు మంత్రులా..

నెల్లూరు, జూన్ 13, సిట్టింగ్ ఎమ్మెల్యే.. మంచి వ్యక్తిగా పేరు తెచ్చుకున్న గౌతంరెడ్డి చనిపోయారు. ఆయన సోదరుడు పోటీ చేస్తున్నారు. ప్రధాన పార్టీలేవీ పోటీ చేయడం లేదు. కానీ.. వైసీపీ మాత్రం లేని పాముని అయినా పెద్ద కర్రతో కొట్టాలని నిర్ణయించుకుని ఏడుగురు మంత్రుల్ని పంపి బాదేస్తోంది. నియోజకవర్గంలోని ఆరు మండలాలకు ఏడుగురు మంత్రులను ఇంచార్జులుగా నియమించారు. మేరుగ నాగార్జున, జోగి రమేష్, అంజాద్ బాషా, కారుమూరి నాగేశ్వరరావు, రోజా, చెల్లుబోయిన వేణుగోపాల్, నారాయణ స్వామి ఇన్చార్జులుగా మండలాల్లో ప్రచారం మొదలు పెట్టారు. మంత్రులే కాదు.. మంత్రులకు తోడుగా ఎమ్మెల్యేలు కూడా ఉన్నారు. ఒక్కో మండలానికి ఇద్దరు, ముగ్గరు ఎమ్మెల్యేలను ఇంచార్జులుగా పెట్టారు. అయితే వారంతా క్షేత్ర స్థాయిలోకి వెళ్లిన తర్వాత వైసీపీ హైకమాండ్ ఎందుకు ఇంత హడావుడి చేస్తుందో అర్థమవుతోంది. ఎక్కడ చూసినా వైసీపీ నేతల మధ్య సఖ్యత లేదు. ఒక్కో గ్రామంలో మూడు, నాలుగు గ్రూపులున్నాయి. గ్రూపులన్నీ కలసి పనిచేయాలని పార్టీ గెలుపుకోసం కృషి చేయాలని చెప్పడానికే వారు ప్రాధాన్యం ఇస్తున్నారు. అయితే ఆ గ్రూపులు రకరకాల కోరికలు కోరుతున్నాయి. గ్రూపుల్లో ఎవరి రాజకీయాలు వారివే, ఎవరి నామినేటెడ్ పోస్టులు వారివే. పార్టీపై పెత్తనం ఒకరిదైతే, ఎంపీపీ మరొకరు. ఇలా ఎవరికి వారు తమ గ్రూపుల్ని మెయింటెన్ చేస్తున్నారు. ఈ క్రమంలో వారందర్నీ కలిపే బాధ్యత ను వైసీపీ ఇంచార్జులు తీసుకున్నారు. మెజార్టీ లక్ష దాటాలని అధినాయకత్వం టార్గెట్ పెట్టింది. అందుకే ఇన్ ఛార్జ్ లుగా ఉన్న మంత్రులంతా హడావిడి పడుతున్నారు. తమ టాలెంట్ చూపించాలని ప్రయత్నిస్తున్నారు. అయితే పోటీ లేని ఎన్నికలో ఈ హడావుడి మొదటికే మోసం తెస్తుందేమోనని కొంత మంది కంగారు పడుతున్నారు.

## జనసేన హామీలు అమలుకు సాధ్యమా...

తిరుపతి, జూన్ 13, ఎన్నికల్లో విజయం సాధించడానికి ప్రజాకర్షక పథకాలు ప్రకటిస్తూంటారు. సహజమే. కానీ ఇప్పుడు ఏపీలో భిన్నమైన పరిస్థితి ఉంది. పూర్తిగా అప్పుల్లో కూరుకుపోయింది. దాదాపుగా రాష్ట్రాన్నే తాకట్టు పెట్టేశారు. దివాలాకు దగ్గరగా ఉన్నామని అందరూ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జనసేన పార్టీ కూడా అదే చెబుతోంది. ఇలాంటి పరిస్థితుల్లోనూ జనసేన పార్టీ ఇస్తున్న హామీలు సోషల్ మీడియాలో రకరకాల చర్చలకు కారణం అవుతున్నాయి. సీపీఎస్ రద్దు చేస్తామని.. ఒక్కో ఇంటికి రూ. పది లక్షలు ఇస్తామని నాదెండ్ల మనోహర్ ప్రకటించడంతో .. జనసేన చెబుతున్నదేంటి..? చేస్తున్నదేంటి అనే చర్చ ప్రారంభమయింది. ఏపీలో వచ్చే ఇరవై ఏళ్ల ఆదాయాన్ని కూడా తాకట్టు పెట్టి అప్పులు తెచ్చుకున్నారు. ఇరవై ఏళ్ల పాటు ఆ అప్పులు కట్టుకుంటూ ఉండాలి. ఇలాంటి పరిస్థితుల్లో ఇంటికి రూ. పది లక్షలు హామీ అనేది నమ్మశక్యవేనా..? అనేది జనసేన పార్టీ నేతలు ఆలోచించుకోలేకపోతున్నారు. తెలంగాణలో దళిత బంధు పథకం పెట్టారు. కానీ ఎంత మందికి ఇవ్వగలుగుతున్నారో ప్రభుత్వం కూడా చెప్పలేకపోతోంది. బడ్జెట్ అయితే కేటాయించారు కానీ.. పూర్తి స్థాయిలో అమలు చేయలేకపోతోంది. మరి అంత కంటే విస్తృతంగా ఇంటికో రూ.పది లక్షలు ఎలా పంచుతారో జనసేన చెప్పాల్సి ఉంది. అలాగే సీపీఎస్ రద్దు చేస్తామని కూడా హామీ ఇస్తున్నారు. ఎలా రద్దు చేస్తారో చెప్పడం లేదు. మీకు చేతకాలేదు..మేము చేసి చూపిస్తామంటున్నారు. రాజస్థాన్‌లో చేయలేదా అని ఎదురుదాడికి దిగుతున్నారు. సీపీఎస్ రద్దు అనేది చాలా ఖర్చుతో కూడుతున్న పని అని రాష్ట్ర బడ్జెట్ కూడా సరిపోదని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. అందులో నిజం లేదు. ఓ పది.. లేదా ఇరవై వేల కోట్లతో అయిపోయేది అయితే.. ఎక్కడో చోట అప్పు తెచ్చి జగన్ ఆ పనీ పూర్తి చేసేవారు. ఎలా అమలు చేస్తారో చెప్పకుండా? ఇలాంటి హామీలు ఇవ్వడం వల్ల జనసేనను జనం నమ్మలేని పరిస్థితి ఏర్పడుతుదని రాజకీయవర్గాలు చెబుతున్నాయి.

## తిరుమలలో పోటెత్తున్న భక్తులు

తిరుమల, జూన్ 13,తిరుమలకు భక్తులు పోటెత్తారు. వేసవి సెలవులు ముగియనున్న నేపథ్యంలో భక్తులు పెద్ద ఎత్తున శ్రీవారిని దర్శించుకుంటున్నారు. దీంతో తిరుమలలో ఒక్కసారిగా భక్తుల రద్దీ



పెరిగింది..ఆదివారం తిరుమలలో ఒక్కసారిగా భక్తుల రద్దీ పెరిగింది. భక్తజనం విపరీతంగా రావడంతో కొండపై భక్తులతో కిటకిట నెలకొంది. శ్రీవారి దర్శనానికి 30 గంటల సమయం పడుతుంది. వైకుంఠం, నారాయణగిరి కంపార్ట్ మెంట్లన్నీ నిండి భక్తులు 3 కిలో మీటర్ల మేరా క్యూలైన్‌లో వేచి ఉన్నారంటేనే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. భక్తుల తాకడితో క్యూలైన్లు శ్రీవారి సేవా సదన్ వరకు నిండారు.భక్తులు ఒక్కసారిగా పోటెత్తడంతో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రతి సెక్టార్‌కి ప్రత్యేకంగా అధికారులను కేటాయించినట్లు ఈవో ధర్మారెడ్డి తెలిపారు. ప్రస్తుతం క్యూలైన్లలోకి చేరుకుంటున్న భక్తులకు శ్రీవారి దర్శించుకోవడానికి రెండు రోజుల పాటు వేచి ఉండాల్సిన పరస్థితి ఉంది. క్యూలైన్లలో ఉన్న భక్తులకు ఎప్పటికప్పుడు ఆహార సదుపాయం కల్పిస్తున్నామని, ఆదివారం రాత్రికి భక్తుల రద్దీ తగ్గే అవకాశముందని పేర్కొన్నారు. భక్తుల రద్దీ పెరిగిన నేపథ్యంలో సామాన్య భక్తులకు ప్రాధాన్యత ఇచ్చేలా సిఫార్సు లెటర్స్ ద్వారా ఇచ్చే బ్రేక్ దర్శనాలు రద్దు చేశారు. అలాగే వారపు ఆర్జిత సేవలను కూడా రద్దు చేసినట్లు ధర్మారెడ్డి తెలిపారు.

## ప్రకాశం జిల్లాలో మరకత విగ్రహం

ఒంగోలు, జూన్ 13, ప్రకాశం జిల్లాలో మరకత విగ్రహం టాక్ ఆఫ్ ది డిస్ట్రిక్ట్‌గా మారింది. అత్యంత పురాతన మరకత విగ్రహం పట్టుబడిందన్న వార్త జిల్లాలో సంచలనంగా మారింది. యర్రగొండపాలెంలో ఐదు ముఖాలు కలిగిన పురాతన వినాయక విగ్రహం దొరికినట్లు తెలుస్తోంది. పంచ ముఖాలు కలిగిన ఈ మరకత విగ్రహాన్ని 25 కోట్ల రూపాయలకు అమ్మేందుకు ప్రయత్నించినట్లు ప్రచారం జరుగుతోంది. ఈ విగ్రహాన్ని అమ్మేందుకు ప్రయత్నించింది కూడా సామాన్యులు కాదని తెలుస్తోంది. ప్రముఖ వ్యక్తులే ఈ మరకత విగ్రహాన్ని పాతిక కోట్ల రూపాయలకు అమ్మేందుకు బేరసారాలు చేయడంతో ఇది బయటపడిందని అంటున్నారు. మరకత విగ్రహంపై లావాదేవీలు జరుపుతుండగా సమాచారం అందుకున్న పోలీసులు, వాళ్లను అదుపులోకి తీసుకున్నట్లు చెబుతున్నారు. కోట్ల రూపాయలు విలువ చేసే ఈ మరకత విగ్రహం ఇప్పుడు ప్రకాశం జిల్లాలో సంచలనం రేపుతోంది. ఇందులో ఇన్వాల్వ్ అయిన వాళ్లంతా ప్రముఖులే కావడంతో గుట్టుగా ఉంచినట్లు ప్రచారం జరుగుతోంది. పక్కా సమాచారంతో నిఘా అధికారులు వాళ్లను పట్టుకున్నట్లు తెలుస్తోంది. అయితే, పొలిటీషియన్స్ పైరవీలతో ఆ మరకత విగ్రహాన్ని యర్రగొండపాలెం పోలీసులకు అప్పగించి వెళ్లిపోయినట్లు టాక్ వినిపిస్తోంది.

# వివేకా మిస్టరీ ముందే తెలుసా...

కడప, జూన్ 12, మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్యకు సంబంధించిన సమాచారం జగన్ కు ముందే తెలుసా? వివేకా హత్య కేసులో సీబీఐ అధికారులు చేస్తున్న తాజా దర్యాప్తు క్రమాన్ని చూసినా, టీడీపీ నేత బుద్దా వెంకన్న చెబుతున్న మాటల్ని గమనించినా వాస్తవం లేకపోలేదేమో అనే మాట వినిపిస్తోంది. ఈ హత్య గురించి ముఖ్య నేతకు ముందే తెలుసని, అందుకే బాబాయ్ హత్యపై ఎక్కడా మాట్లాడడం లేదని బుద్దా వెంకన్న ఆరోపిస్తున్నారు. వివేకా హత్యకేసులో నిందితులను ఎందుకు కాపాడుతున్నారని బుద్దా నిలదీస్తున్నారు. ఈ హత్య కేసు నిందితులు అనుమానాస్పదంగా ఎందుకు మరణిస్తున్నారంటూ బుద్దా వెంకన్న ప్రశ్నిస్తున్నారు.మరో పక్కన.. వివేకా హత్య కేసు దర్యాప్తును సీబీఐ అధికారులు మరింత ముమ్మరం చేశారు. దాంట్లో భాగంగా పులివెందులలోని జగన్ క్యాంపు కార్యాలయానికి ప్రభుత్వ సర్వేయర్ తో కొలతలు తీయించడం, వీడియో, ఫొటోలు తీయించడం కూడా బుద్దా వెంకన్న మాటల్లో కొంతైనా నిజం ఉండొచ్చనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. క్యాంపు ఆఫీసుతో పాటు అవినాశ్ రెడ్డి ఇంటికి కూడా సీబీఐ అధికారులు కొలతలు తీయించిన వైనాన్ని ప్రస్తావిస్తున్నారు. నిప్పు లేనిదే పొగ రాదంటారు. వివేకా కేసులో సీబీఐ అధికారులకు లింక్ ఏదో దొరికి ఉండొచ్చని, అందుకే తమ దర్యాప్తును జగన్, అవినాశ్ రెడ్డి ఇళ్ల నుంచి కూడా చేస్తుండవచ్చనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. వివేకా హత్య కుట్ర వెనుక ఓ కీలక మహిళ హస్తం ఉందని, ఆ 'శివగామి' ఎవరనే చర్చ కూడా గతంలో బాగా జరిగిన వైనాన్ని కొందరు గుర్తుచేస్తున్నారు.గత ఎన్నికలకు ముందు చంద్రబాబు నాయుడి ప్రభుత్వ హయాంలో వివేకా హత్య జరిగింది. అప్పుడు ప్రతిపక్ష నేతగా ఉన్న జగన్ అప్పట్లో ఈ కేసు దర్యాప్తును సీబీఐకి అప్పగించాలని డిమాండ్ చేశారు. 2019 ఎన్నికల్లో గెలిచి, తాను సీఎం అయినా ఈ హత్య కుట్రను ఛేదించే విధంగా ఎందుకు ప్రయత్నించలేదనే ప్రశ్నలు పలువురి నుంచి వ్యక్తం అవుతున్నాయి. కేసు విచారణలో అసలు వాస్తవాలు బయటికి వస్తే.. బాగా కావాల్సిన వారెవరో ఇరుక్కుపోతారనే ముఖ్యనేత అంతగా ప్రాధాన్యం ఇవ్వడం లేదేమో? అని ఇంత వరకూ అంతా అనుకుంటూ వచ్చారు. సీబీఐ దర్యాప్తు గమనించిన తరువాత అందుకేనన్న నిర్ధారణకు వస్తున్నారు.వివేకా హత్య కేసులో ముద్దాయిలెవరో తేల్చకుండా జగనే అడ్డుకుంటున్నారని జనం అనుకుంటున్నారన్న టీడీపీ నేత వర్ల రామయ్య మాటల్లో వాస్తవం లేకపోలేదంటున్నారు. అసలు ముద్దాయిలెవరో తేల్చాల్సిన బాధ్యత సీఎంగా జగన్ కు లేదా? అని ప్రశ్నిస్తున్నారు. కోర్టు ఆదేశాలతో ఈ హత్య కేసును దర్యాప్తు చేస్తున్న సీబీఐ అధికారులపై జగన్ ఆధ్వర్యంలోని స్థానిక పోలీసులు కేసులు పెట్టడం వెనక కారణం ఏంటో తెలియాలంటున్నారు. బాబాయ్ ని చంపిన అసలు ముద్దాయిలెవరో బయటికి రాకూడదు, అసలు ముద్దాయిలు అరెస్ట్ కాకూడదనే ఆలోచన ఎవరిదని వర్ల ప్రశ్నించడం గమనార్హం.వివేకా హత్య మిస్టరీ వెనుక అసలు రహస్యం మూడేళ్లు దాటిపోయినా వెలికి రాలేదు. సరికదా.. ఈ కేసులో అప్రూవర్ గా మారిన డ్రైవర్ దస్తగిరికి బెదిరింపులు రావడం, ప్రాణహాని భయంతో దస్తగిరి పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేయడం, ఇదే కేసులో సాక్షి గంగాధర్ రెడ్డి అనుమానాస్పద స్థితిలో మరణించడం వెనుక పెద్ద తలకాయల ఒత్తిడి ఉండొచ్చనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. పరిటాల రవి హత్య తర్వాత మొద్దు శీనుతో పాటు నిందితులు, సాక్షులు ఎలా చనిపోయారో ఇప్పుడూ అదే జరుగుతోందని బుద్దా వెంకన్న ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వివేకా మర్డర్ కేసుకు సంబంధించి మరిన్ని సంఘటనలు భవిష్యత్తులో జరిగే అవకాశం ఉందని భయాందోళనలు వ్యక్తం అవుతున్నాయి. ఈ క్రమంలో వివేకా కుమార్తె సునీతారెడ్డి, ఆమె భర్త రాజశేఖర్ రెడ్డికి కూడా ప్రాణహాని ఉండొచ్చని, వారికి రక్షణ కల్పించాలనే డిమాండ్ వస్తోంది.

## నేడు ప్రపంచ రక్త దాతల దినోత్సవం

ప్రపంచ వ్యాప్తంగా అన్ని దేశాల్లోని ప్రజలకు రక్తం విలువని తెలపాలనే ఉద్దేశంతో ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని ప్రతి సంవత్సరం జూన్14న నిర్వహిస్తున్నారు. 1901లో ఆస్ట్రేలియాకు చెందిన నోబెల్ విజేత కార్ల్ లాండ్‌స్టీనర్ మొదటిసారిగా రక్తాన్ని వర్గీకరించారు. దీంతో ఆయన జయంతి గుర్తుగా ఈ దినోత్సవాన్ని జరుపుకుంటున్నారు. మొదటిసారిగా ఈ దినోత్సవాన్ని 2004లో అన్ని దేశాల్లో నిర్వహించారు. రక్తాన్ని కృత్రిమంగా తయారు చేయడానికి వీలుకాదు. అయితే రక్తదాతలు ఎవరైనా రక్తాన్ని దానం చేసి, మరొకరి ప్రాణాలను కాపాడవచ్చు. 18 సంవత్సరాలు నుండి 55ఏళ్ల లోపు ఉన్నవారు రక్తదానానికి అర్హులు. కనీసం రక్తదాతల శరీర బరువు 50 కిలోలు ఉండాలి. రోగ నివారణ కోసం, ప్రమాదాల సమయంలో బాధితుల శరీరంలో తగినంతగా రక్తం లేకపోతే మరొకరి నుంచి రక్తాన్ని ఎక్కిస్తుంటారు. ఇలా ఒకరి రక్తం మరొకరికి ఇచ్చే విధానమే రక్తదానం. రక్తాన్ని తీసుకొనే వ్యక్తిని గ్రహీత అని, ఇచ్చే వ్యక్తిని దాత అని అంటారు. 'ఓ' గ్రూప్రక్తం కలిగిన వారిని విశ్వదాత అని, 'ఏబీ'. గ్రూపుల రక్తం కలిగినవారిని విశ్వగ్రహీత అని అంటారు. రక్తదానం చేస్తే బలహీనపడి, నీరసించిపోతారు ఒక అపోహ ఉంది కానీ రక్తదానం తర్వాత ఎటువంటి బలహీనత సంభవించదు. ఎప్పటిలా ఆరోగ్యంగా ఉంటారు. శ్రమతో కూడిన కష్టమైన పనులు చేసుకునేవారు ఇంతకుముందులా పనిచేసుకోలేరు ఒక అపోహ ఉంది కానీ రక్తదానం తర్వాత యధావిధిగా అన్నిరకాల శ్రమతో కూడిన పనులు చక్కగా చేసుకోవచ్చు. రక్తదానం చేసే సమయంలో విపరీతమైన నొప్పి ఉంటుంది అని ఒక అపోహ ఉంది కానీ రక్తదానం సమయంలో ప్రత్యేకమైన సూది గుచ్చేటప్పుడు కలిగే చిన్నపాటి నొప్పి తప్పించి ఎటువంటి తీవ్రమైన నొప్పి ఉండదు. రక్తదానం వల్ల ఎయిడ్స్ సంక్రమించవచ్చు అని ఒక అపోహ ఉంది. వాస్తవానికి రక్తదానం పూర్తి శాస్త్రీయమైన, సురక్షితమైన పద్ధతులలో ఏ రకమైన వ్యాధి క్రిములు సోకే అవకాశంలేని విధంగా జరుగుతుంది.

## ప్రైవేట్ బస్సు బోల్తా.. ఐదుగురి మృతి

చింతూరు అల్లూరి సీతారామరాజు జిల్లాలో రోడ్డు ప్రమాదం జరిగింది. చింతూరు మండలం ఏడుగురాళ్లపల్లి వద్ద సంగీత ట్రావెల్స్ కు చెందిన ప్రైవేటు బస్సు బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఐదుగురు మృతి చెందారు. ఘటనాస్థలంలో ముగ్గురు.. భద్రాచలం ప్రభుత్వాస్పత్రిలో ఇద్దరు మృతిచెందారు. మృతుల్లో ఇద్దరు చిన్నారులు ఉన్నారు. మరో ముగ్గురు భద్రాచలం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఒడిశాలోని చిన్నపల్లి నుంచి విజయవాడకు వెళ్తుండగా బస్సు ప్రమాదానికి గురైనట్లు తెలుస్తోంది. మృతుల్లో ధనేశ్వర్ దళపతి(24), జీతు హరిజన్(5), సునేనా హరిజన్(2)తో పాటు మరో ఇద్దరు ఉన్నారు. వీరంతా ఒడిశా వాసులుగా గుర్తించారు. స్థానికుల సమాచారంతో ఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు.. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

## తొమ్మిదో వార్డులో పట్టణ ప్రగతి

మంథని మంథని మున్సిపల్ పరిధిలోని 9వ వార్డులో కౌన్సిలర్ చొప్పకట్ల హన్మంతరావు ఆధ్వర్యంలో పట్టణ ప్రగతి కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ పట్టణ ప్రగతిలో మున్సిపల్ చైర్మన్ పుట్ట శైలజ పాల్గొని పనులని పరిశీలిస్తూ పలు సమస్యలను పరిష్కరిస్తూ, మురికి కాలువలు తిపించి, రోడ్లను శుభ్రం చేయిస్తు పలు సూచనలు చేశారు. ఈ వార్డు పరిధిలోని మహాలక్ష్మి గుడి ఆవరణలో మొక్కలు నాటి సంరక్షిస్తూన్న ప్రకృతి ప్రేమికుడు గట్టు కృష్ణ మూర్తి ని మున్సిపల్ చైర్మన్ పుట్ట శైలజ ప్రశంసించి శాలువతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ మహమ్మద్ మేరాజ్ మహుమూద్, మున్సిపల్ కమిషనర్ యు.శారద ,మహాలక్ష్మి దేవాలయ చైర్మన్ మారుపాక చంద్రకళ - రమేష్, వార్డు ఇన్చార్జులు, మేప్మా ఆర్పిస్, ఆశా వర్కర్స్, పాల్గొన్నారు.

## అర్జీదారుల సమస్యలను వేగవంతంగా పరిష్కరించండి

**జాయింట్ కలెక్టర్ సాయికాంత్ వర్మ**

కడప ప్రజా సమస్యల పరిష్కారార్థం ఏర్పాటు చేసిన "స్పందన" కార్యక్రమం ద్వారా స్వీకరించిన అర్జీదారుల సమస్యలను వేగవంతంగా పరిష్కరించాలని అన్ని శాఖల అధికారులను జాయింట్ కలెక్టర్ సాయికాంత్ వర్మ ఆదేశించారు.సోమవారం కలెక్టరేట్లోని స్పందన హాల్లో.. ప్రజా ఫిర్యాదుల స్వీకరణ "స్పందన" కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి జాయింట్ కలెక్టర్ సాయికాంత్ వర్మ తో పాటు డిఆర్వో మాలోల, డ్వామ, డిఆర్డీఏ, ఏపీఎంఐపి పీడిలు యదుభూషణ్ రెడ్డి, మధుసూదన్ రెడ్డి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రోహిణి, అనుడ విసి శ్రీలక్ష్మి..లు ప్రజల నుండి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ సాయికాంత్ వర్మ మాట్లాడుతూ.... ఫిర్యాదుదారుల విజ్ఞప్తులను సంబంధిత అధికారులు .. క్షేత్ర స్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి పారదర్శకంగా విచారణ చేసి, అర్జీదారుడు సంతృప్తిచెందేలా నిర్ణీత గడువులోపు తప్పనిసరిగా పరిష్కరించాలన్నారు. పెండింగ్ బియాండ్ ఎస్ఎల్ఏ, రీఓపెనింగ్.. లేకుండా అర్జీదారుడు సంతృప్తి చెందేలా అర్జీలను పరిష్కరించాలన్నారు. స్పందన ద్వారా.. ప్రజల నుండి అందిన విజ్ఞప్తులలో కొన్ని.... కడప నగరం.. ఆజాద్ నగర్ కు చెందిన కె. సుబ్బమ్మ.. వికలాంగుడు అయిన తాను ఎస్.కె.డి. జి.ఎన్.ఎస్.ఎస్. డివిజన్ -1లో ఆఫీస్ సబార్డినెట్ గా ఉద్యోగం చేస్తున్నానని.. కడప క్వాలిటీ కంట్రోల్ డివిజన్ కు తనను ట్రాన్స్ఫర్ చేయాలని వేడుకుంటూ... జిల్లా స్పందనలో అర్జీ సమర్పించారు. కడప నగరం చిన్నచౌక్ కు చెందిన.. పొలా తిరుపతి.. ఎస్టీ కులానికి చెందిన తన ఇద్దరు పిల్లలకు 7, 8 తరగతులకు గురుకుల పాఠశాలలో సీట్లు ఇప్పించాలని.. జిల్లా స్పందన కార్యకమంలో వినతి పత్రం సమర్పించారు.లింగాల మండలం.. గునకనపల్లికి చెంసిన అంకిరెడ్డి దిలీప్ రెడ్డి... తన గ్రామంలో దారికి అడ్డంగా కాంపౌండ్ వాల్ నిర్మిస్తున్నారని.. సంబందిత అధికారులు చర్యలు తీసుకుని... అక్రమ కట్టడాన్ని తొలగించాలని జిల్లా స్పందనలో విన్నవించారు.నగర శివార్లలోని రామాంజ నేయపురం చెందిన షేక్ సాబిరుక... 26-01-2000లో తన కుమారుడు ఈతకెళ్లి ప్రాణాలు కోల్పోయాడని ఇంతవరకు ఎక్స్ గ్రేషియా అందలేదని.. అధికారులు తగు న్యాయం చేయాలని స్పందనలో వినతిపత్రం సమర్పించారు బి.మఠం మండల కేంద్రానికి చెందిన వెంకట సుబ్బారెడ్డి.. వికలాంగుడు అయిన తనకు రెసిడెన్షియల్ పాఠశాలలో అవుట్ సోర్స్ కింద అటెండర్ ఉద్యోగం ఇప్పించాలని కోరుతూ..స్పందనలో విన్నవించారు.కార్యక్రమంలో సమగ్ర శిక్ష పీడి ప్రభాకర రెడ్డి, జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డా.నాగ రాజు, ఎల్డిఎం దుర్గా ప్రసాద్, రిమ్స్ సూపర్ ఇన్ టెండెంట్ డా.వెంకటేశ్వర రావు, గృహనిర్మాణశాఖపీడి కృష్ణయ్య, ఎస్ సి కార్పొరేషన్ ఈడి వెంకట సుబ్బయ్య, జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖాధికారిబ్రహ్మయ్య, జిల్లా వ్యవసాయ శాఖాధికారి నాగేశ్వరరావు, జిల్లా ఉపాధి కల్పనాధికారి దీప్తి, గ్రౌండ్ వాటర్ డిడి మురళి, అన్ని శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## జగన్ పార్టీకి విజయమ్మ దూరం



కడప, జూన్ 13, (న్యూస్ పల్స్)వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ గౌరవాధ్యక్షురాలు విజయమ్మ... తన గౌరవాధ్యక్షురాలి పదవి రాజీనామా చేయడం ఖాయమేనా? అందుకు కౌంట్ డౌన్ మొదలైందా? మరి కొద్దిరోజుల్లో ఆమె ఆ పదవికీ రాజీనామా చేసి... హైదరాబాద్ లోటస్ పాండ్‌లోని వైయస్ఆర్ తెలంగాణ పార్టీ అధ్యక్షురాలు, తన కుమార్తె వైయస్ షర్మిల వద్దే ఉండనున్నారా? అంటే వైసీపీ వర్గీయుల నుంచి అవుననే సమాధానం వస్తోందీ.వచ్చే నెల 8, 9 తేదీల్లో అధికార వైసీపీ ప్రతిష్టాత్మంగా నిర్వహించనున్న ప్లీనరీ వేదికగా ఆమె తన పదవికీ రాజీనామా చేయనున్నారని సమాచారం. విజయవాడ - గుంటూరు జాతీయ రహదారిపై ఆచార్య నాగార్జున నగర్ సమీపంలోని మైదానంలో ప్లీనరీ నిర్వహించాలని వైసీపీ ఇప్పటికే నిర్ణయించింది. ఆ క్రమంలో అందుకు సంబంధించిన పనులు త్వరలో ప్రారంభకానున్నాయని తెలుస్తోంది. ఈ సభను జయప్రదం చేసేందుకు ఇప్పటికే.. ఆ పార్టీ అగ్రనేతలు దృష్టి సారించారు. 2017, జులై 8న వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ప్లీనరీని నిర్వహించిన సంగతి తెలిసిందే. నాటి ఈ సభకు భారీగా ప్రజలు తరలి రావడమే కాదు...ఈ సభా వేదికపైన వైయస్ విజయమ్మ, వైయస్ షర్మిల కూడా ఉన్నారు. కానీ నేడు ఆ పరిస్థితి లేదని ఆ పార్టీ నేతలు పేర్కొంటున్నారు.ఇక జగన్ అధికారంలోకి వచ్చిన తర్వాత చోటు చేసుకున్న పరిణామాల నేపథ్యంలో షర్మిల, విజయమ్మ.. హైదరాబాద్ కు పరిమితమైపోయారు. ఆ క్రమంలో వైయస్ఆర్ తెలంగాణ పార్టీని స్థాపించి.. ఆ రాష్ట్రంలో పాదయాత్ర చేస్తోంది. దీంతో దాదాపుగా జగన్‌కు సోదరి, తల్లిలతో గ్యాప్ పెరిగిపోయింది. ఈ నేపథ్యంలో సీఎం జగన్‌తో వీరిద్దరు ఎడముఖం పెడ ముఖంగా ఉంటున్నారన్న సంగతి అందరికీ తెలిసిందే. అలాంటి పరిస్థితిలో.. రాష్ట్రం కానీ రాష్ట్రంలో ఉంటూ.. అధికారంలో ఉన్న ఓ పార్టీకి గౌరవ అధ్యక్షురాలిగా కొనసాగడం భావ్యం కాదనే ఆలోచనలో విజయమ్మ ఉన్నట్లు చెబుతున్నారు. అందుకే తన పదవికీ రాజీనామా చేసి.. గౌరవంగా ఫ్యాన్ పార్టీ నుంచి తప్పుకోవాలని ఆమె భావించారని.. ఇదే విషయాన్ని తన కుమారుడు సీఎం వైయస్ జగన్ వద్ద విజయమ్మ ప్రస్తావించగా.. ప్లీనరీ వరకు వేచి ఉండాలంటూ జగన్ సూచించినట్లు గతంలో అటు మీడియాలో ఇటు సోషల్ మీడియాలో వార్తలు హల్ చల్ చేశాయి. ఈ నేపథ్యంలో జూలై 8వ తేదీన తన పదవికీ విజయమ్మ రాజీనామా ప్రకటిస్తారని తెలుస్తోంది. మరోవైపు.. ఈ ప్లీనరీకి ఎలాగో వైయస్ఆర్ టీపీ అధ్యక్షురాలు షర్మిల రారని వైసీపీ వర్గాలు పేర్కొంటున్నారు. మరి అలాంటి పరిస్థితుల్లో విజయమ్మను ప్లీనరీకి షర్మిలా పంపుతారా? అంటే సందేహమే అనే చర్చ కూడా వైసీపీలో జరుగుతోంది.ఏదీ ఏమైనా గతంలో వైసీపీ ప్లీనరీకే కాదు.. నాడు ప్రతిపక్ష నేతగా జగన్ చేపట్టిన పాదయాత్రకు సైతం ప్రజలు బ్రహ్మరథం పట్టారు. కానీ జగన్ అధికారంలోకి వచ్చిన తర్వాత.. చోటు చేసుకొన్న పరిణామాల నేపథ్యంలో ఆయన కుటుంబ సభ్యులే కాదు.. పలు వర్గాల ప్రజలు కూడా జగన్ కు, ఆయన పార్టీకీ దూరమయ్యారన్న సంగతి విదితమే. అలాంటి పరిస్థితుల్లో జగన్ పార్టీ ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న ఈ ప్లీనరీకి జనం పొటెత్తుతారా? అంటే సందేహమే అని వైసీపీలోని ఓ వర్గం బల్లగుద్దీ మరీ చెబుతోంది.2019 ఎన్నికల్లో జగన్ అధికారంలోకి రావడానికి.. ఎన్నికల వ్యూహాకర్త ప్రశాంత్ కిషోర్ ఎంతగా దోహదం చేశారో.. అంతగా విజయమ్మ, షర్మిల కూడా తోడ్పాటునందించారు. కానీ నేడు.. ప్రశాంత్ కిషోర్‌కు చెందిన ఐ ఫ్యాక్ సంస్థతో పాటు ఆ సంస్థ వ్యవస్థాపకుడు రుషి రాజ్ సింగ్ .. జగన్ వెంటనే ఉన్నారు. కానీ విజయమ్మ, షర్మిలలు.. జగన్ వెంట లేకపోవడం పెద్ద లోటేనని ఫ్యాన్ పార్టీలోని ఆ వర్గం నేతలు అభిప్రాయపడుతున్నారు. రానున్న ఎన్నికల్లో.. తల్లి చెల్లి లేకుండా జగన్ నెగ్గుకురాగలరా అంటే ఏమో అని ఆ పార్టీ నేతలే అనుమానం వ్యక్తం చేయడం పలు సందేహాలకు తావిస్తున్నట్లవుతోందని రాజకీయ విశ్లేషకులు కూడా పేర్కొనడం గమనార్హం

## టిడిపి నేత, మాజీ మంత్రి దేవినేని ఉమా హౌస్ అరెస్ట్

గొల్లపూడిగుంటూరు జిల్లా తాడికొండ మండలం కంతేరువాసి, టీడీపీ సానుభూతిపరురాలు వెంకాయమ్మపైన, ఆమె కుమారుడిపైన దాడిని తీవ్రంగా ఖండిస్తూ... తెదేపా ఛలో తాడికొండ (కంతేరు) కార్యక్రమం నిర్వహించింది. విమర్శిస్తే.. దాడులు చేస్తారా? అని అధికార వైసీపీపై మాజీ మంత్రి దేవినేని ఉమా ఆగ్రహం వ్యక్తం చేసారు.కొద్ది రోజుల క్రితం వెంకాయమ్మపై దాడి చేశారని, ఇప్పుడు ఆమె కుమారుడిపై దాడి చేశారు. ఒక దళిత మహిళపై దాడులు కొనసాగుతుంటే పోలీసులు ఏం చేస్తున్నారు. గత నెల 16వ తేదీన వెంకాయమ్మపై దాడి జరిగినా చర్యలు తీసుకోలేదు. ఒక కుటుంబంపై అరాచక శక్తులు పదేపదే దాడులకు పాల్పడుతున్నా.. అడ్డుకోకపోవడం పోలీసులను వైఫల్యం కాదా? మీడియాతో మాట్లాడేందుకు స్టేషన్ బయటకు వచ్చిన ఆనంద్బాబు, మాణిక్యాలరావులను.. వెంకాయమ్మ, ఆమె కుమారుడిపై దాడి చేసిన వారు, వైసీపీ శ్రేణులు అడ్డుకోవడం దారుణం. ప్రభుత్వ వైఫల్యాలను సోషల్ మీడియా ద్వారా ఎండగట్టినందుకు వెంకాయమ్మ ఆమె కుటుంబ సభ్యులను వేధిస్తున్నారని అన్నారు.ప్రజాస్వామ్యంలో ఎవరికైనా స్వేచ్ఛగా తమ అభిప్రాయాలను వ్యక్తం చేసే హక్కు ఉంది. పాలనా వైఫల్యాలను, తప్పులను ప్రశ్నించిన వారిపై దాడికి పాల్పడటం వైకాపా నేతలు, కార్యకర్తలకు దినచర్యగా మారింది. వెంకాయమ్మ కుటుంబానికి తగిన భద్రత కల్పించి, భవిష్యత్తులో ఇలాంటి హింసాత్మక ఘటనలు జరగకుండా కఠిన చర్యలు తీసుకోవాలని అన్నారు.

## త్రాగునీటి,సమస్యను పరిష్కరించాలి

**వైసిపి కౌన్సిలర్లు దీక్షలు**

కాకినాడ కాకినాడ జిల్లా సామర్లకోట పట్టణంలో మునిసిపల్ అధికారులు పట్టణ ప్రజలకు శుద్ధిచేసిన. త్రాగునీటిని సరఫరా చేయడంలో పూర్తిగా విఫలం అయ్యారని ఆరోపిస్తూ అధికార పక్షం, వైసీపీ పార్టీకి చెందిన ఇద్దరు కౌన్సిలర్లు పితాని కృష్ణ, కరణం రాజ్ కుమార్ లు సోమవారం ఆమరణ నిరాహార దీక్షలు ప్రారంభించారు. త్రాగునీటి సమస్యపై తాము దీక్షలు చేస్తామని రెండు రోజుల క్రితమే కృష్ణ ప్రకటించిన విషయం విదితమే. పార్టీలోనే అన్ని వర్గాలూ ఆమరణ నిరాహార దీక్షలను. విరమింపజేసేందుకు చేసిన ప్రయత్నాలు విఫలం అయ్యాయి.

# బద్వేల్ తెలుగుదేశం పార్టీలో కొత్త ఉత్సాహం

బద్వేలు బద్వేలు నియోజకవర్గం తెలుగుదేశం పార్టీలో కొత్త ఉత్సాహం కనబడుతుంది గతంలో ఎప్పుడూ లేని విధంగా పార్టీ నాయకులు కార్యకర్తలు ఉత్సాహంతో ఉన్నారు నియోజకవర్గంలోని ఏడు మండలాల్లో పార్టీ నాయకులు కార్యకర్తలు వచ్చే ఎన్నికల్లో పార్టీ అభ్యర్థి గెలుపే లక్ష్యంగా ఇప్పటి నుంచే పని చేస్తున్నారు వీరంతా పార్టీ సీనియర్ నాయకురాలు మాజీ ఎమ్మెల్యే విజయమ్మ పార్టీ యువనేత రితేష్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో పని చేస్తున్నారు విజయమ్మ రితేష్ కుమార్ రెడ్డి లు కూడా నాయకులు కార్యకర్తలతో కలసి పని చేస్తూ వారిలో ఎక్కడలేని ఉత్సాహం నింపుతున్నారు ఇటీవల తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కడప జిల్లాలో పర్యటించారు కడప కమలాపురంలో చంద్రబాబు నాయుడు బాదుడే బాదుడు కార్యక్రమంలో పాల్గొన్నారు ఈ కార్యక్రమంలో బద్వేలు నియోజకవర్గం నుంచి వందలాది మంది కార్యకర్తలు నాయకులు తరలివెళ్లారు బాదుడే బాదుడు కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో బద్వేల్ నియోజకవర్గం చెందిన నాయకులు కార్యకర్తలు క్రియాశీలక పాత్ర పోషించారు కార్యక్రమం ముగిసిన అప్పటినుంచి కార్యకర్తలు నాయకులు మరింత ఉత్సాహంగా పని చేస్తున్నారు నియోజకవర్గంలోని 7 మండలాలు ఒక ఎత్తైతే బద్వేలు పట్టణం మరో ఎత్తు అయ్యింది పట్టణంలో లక్షకుపైగా జనాభా ఉండగా దాదాపు 40 వేలకు పైగా ఓటర్లు ఉన్నారు బద్వేల్ పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు గుర్రంపాటి వెంగాల రెడ్డి పార్టీ కార్యక్రమాల్లో ఉత్సాహంగా పనిచేస్తూ అందరిని ఒకతాటిపై తీసుకు వస్తున్నారు అందులో భాగంగా మున్సిపాలిటీ ఓటర్లు పార్టీ వైపు తీసుకు వచ్చేందుకు ఇప్పటి నుంచే ఆయన కృషి చేస్తున్నారు ప్రస్తుత వైకాపా ప్రభుత్వంపై ఉన్న ప్రజా వ్యతిరేకతను ఆయన సద్వినియోగం చేసుకుంటున్నారు వెంగళ రెడ్డి పార్టీ కోసం కష్టపడుతున్న విషయం చంద్రబాబు వద్దకు వెళ్ళింది దీంతో ఆయన ను చంద్రబాబు ప్రత్యేకంగా ప్రశంసించి అభినందించారు చంద్రబాబు అభినందనలు ప్రశంసలు పొందిన వేంగలరెడ్డి మరింత చురుగ్గా పార్టీ కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు 2024 ఎన్నికలకు తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు ఇప్పటి నుంచే సిద్ధమవుతున్నారు పాలక పక్షంపై పెరుగుతున్న ప్రజా వ్యతిరేకతను తెలుగుదేశం పార్టీ ఇప్పటి నుంచే సద్వినియోగం చేసుకుంటుంది ఓసారి తెలుగుదేశం పార్టీ బద్వేలు నియోజకవర్గంలో తిరుగులేని విజయాలు సాధించింది మాజీ మంత్రి

**వచ్చే ఎన్నికల్లో పార్టీ విజయం నల్లేరుపై బండి నడకే**
**నాయకులు కార్యకర్తల్లో ఉత్సాహం నింపుతున్న**
**మాజీ ఎమ్మెల్యే విజయమ్మ**
**స్పీడ్ పెంచిన బద్వేలు మున్సిపాలిటీ అధ్యక్షుడు**
**వెంగలరెడ్డిపార్టీ**

దివంగత బిజినవేముల వీరారెడ్డి బద్వేల్ నియోజకవర్గాన్ని తెలుగుదేశం పార్టీకి కంచుకోటగా మార్చారు 2000 సంవత్సరం డిసెంబర్ 25వ తేదీ మంత్రి హోదాలో వీరారెడ్డి మృతి చెందారు ఆ తర్వాత జరిగిన ఉప ఎన్నికల్లో వీరారెడ్డి కుమార్తె విజయమ్మ తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా పోటీ చేసి విజయం సాధించారు అప్పటి నుంచి ఇప్పటివరకు తెలుగుదేశం పార్టీకి విజయం లేకుండా పోయింది బద్వేలు నియోజకవర్గం రిజర్వు అయిన తర్వాత తెలుగుదేశం పార్టీతో విజయం దోబూచులాడుతుంది ప్రతి ఎన్నికల్లోనూ తెలుగుదేశం పార్టీ అభ్యర్థి పోటీ చేయడం గెలవలేక పోవడం సర్వసాధారణంగా మారింది కానీ త్వరలో జరిగే అసెంబ్లీ ఎన్నికలలో తెలుగుదేశం పార్టీ అభ్యర్థి విజయం ఖాయమని ఆ పార్టీ నాయకులు కార్యకర్తలు ఇప్పటి నుంచే భరోసా కనబరుస్తున్నారు బద్వేల్ నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీకి పూర్వ వైభవం తీసుకువచ్చేందుకు నాయకులు కార్యకర్తలు చేస్తున్న ప్రయత్నాలు అన్ని ఇన్ని కావని చెప్పాలి అభ్యర్థి ఎవరైనా వారి విజయం కోసం కష్టపడి పని చేస్తామని వారు అంటున్నారు ఇప్పటినుంచి పార్టీ నాయకులు కార్యకర్తలు ప్రజలతో మమేకం అవుతున్నారు పాలకపక్షం నాయకులు కార్యకర్తలు కొందరు అధికార పార్టీని అడ్డుపెట్టుకొని చేస్తున్న భూకబ్జాలు గురించి ప్రజల ముందు పెడుతున్నారు బద్వేల్ నియోజక వర్గంలో అధికార పార్టీకి చెందిన కొందరు ముఖ్య నాయకులు దాదాపు రెండు వేల కోట్ల రూపాయలు విలువచేసే ప్రభుత్వ భూములు ప్రభుత్వ స్థలాలు కబ్జా చేశారని అనేక సందర్భాల్లో తెలుగుదేశం పార్టీ నాయకులు చెబుతూ రావడమే గాక కొన్ని సాక్ష్యాధారాలు పత్రికా విలేకరుల సమావేశంలో బయటపెట్టారు అధికార పార్టీ నేతల భూకబ్జాలు తెలుగుదేశం పార్టీకి పెద్ద అస్త్రంగా మారింది పేదలకు దక్కవలసిన ప్రభుత్వ భూములు అధికార పార్టీ పెద్దల పరం అయ్యాయని తెలుగుదేశం పార్టీ నాయకులు గత కొద్ది రోజులుగా ఆరోపణల మీద ఆరోపణలు చేస్తూ వస్తున్నారు అధికార పార్టీ నాయకులు కొందరు దోచుకోవడమే పనిగా పెట్టుకున్నారని ఇందుకు సంబంధించి తగిన ఆధారాలు కూడా బయటపెడతామని వాళ్లు సవాలు విసురుతున్నారు ఒకే విధంగా చెప్పాలంటే బద్వేలు నియోజకవర్గంలోని ఏడు మండలాల్లో తెలుగుదేశం పార్టీ గాలులు వీస్తున్నాయని రాజకీయ పరిశీలకులు ఇప్పటికే ఒక అంచనాకు వచ్చారు తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు మరింతగా కష్టపడితే వచ్చే ఎన్నికల్లో పార్టీ అభ్యర్థి విజయం నల్లేరుపై బండి నడకే అని వారు అంచనా వేస్తున్నారు కాగా పార్టీ అభ్యర్థి ఎవరనేది ఇప్పటికీ స్పష్టం కావడం లేదు గత ఎన్నికలలో పార్టీ అభ్యర్థిగా డాక్టర్ రాజశేఖర్ పోటీ చేశారు ఉప ఎన్నికల్లో సైతం ఆయన పేరుని పార్టీ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు ప్రకటించారు కానీ ఉప ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ పోటీ చేయలేదు కాగా డాక్టర్ రాజశేఖర్ పై ప్రజల్లో మంచి అభిప్రాయం లేదు ఇది ఆయనకు పెద్ద మైనస్ గా చెప్పాలి డాక్టర్ రాజశేఖర్ ప్రజలతో సంబంధాలు చాలా వరకు లేవని చెప్పాలి కేవలం తెలుగుదేశం పార్టీ నాయకుల వెంట తిరగడం తప్ప ప్రజలతో మంచి సంబంధాలు కలిగి ఉండాలి అనే భావన ఆయనకు మొదటినుంచి లేకపోవడం విచారకరం వచ్చే ఎన్నికల్లో తిరిగి డాక్టర్ రాజశేఖర్ కు పార్టీ అభ్యర్థిగా నిలబడితే విజయం తెలుగుదేశంతో మరోసారి దోబూచులాడుతుంది అని రాజకీయ పరిశీలకులు ఇప్పటినుంచి అంచనా వేస్తున్నారు మరి తెలుగుదేశం పార్టీ కీలక నాయకులు ఈ విషయంలో ఎటువంటి నిర్ణయం తెలుసుకుంటారు అనేది వేచి చూడాలి



# ధ్వజ స్తంభ ప్రతిష్ట కు నా వంతు సహకారం

## ప్రసాద్ కూరగాయల మార్కెట్ కమిటీ సభ్యులు



నంద్యాల :- నంద్యాల జిల్లా బండిఆత్మకూరు మండలం శ్రీ గుండ్ల బ్రహ్మేశ్వర ఆలయ ధ్వజ స్తంభ ప్రతిష్ట మహోత్సవం 20 వతేదినుంచి 23 వతేది వరకు జరుగుతాయని . శ్రీ గుండ్ల బ్రహ్మేశ్వర ఆలయ అభివృద్ధి కమిటీ వారు తెలిపారు. ఇందులో భాగంగా సోమవారం నాడు కూరగాయల మార్కెట్ కమిటీ సభ్యులు అయిన ప్రసాద్ ను కలవడం జరిగిందన్నారు గుండ్ల బ్రహ్మేశ్వర ఆలయ ధ్వజ స్తంభ ప్రతిష్ట గురించి ప్రసాద్ కు తెలియజేశాము. ప్రసాద్ మా విన్నపం మేరకు 10.000 రూపాయలు నగదు ఇస్తూ. మరియు ప్రతిష్ట జరుగుతున్న మూడు రోజుల అన్న దాన కార్యక్రమంనకు సరిపడు కూరగాయల వితరణగా ఇస్తానని కమిటీ వారికి హామీ ఇవ్వడం జరిగిందన్నారు . కమిటీ సభ్యులు మాట్లాడుతూ మాకు అడిగిన వెంటనే 10.000 రూపాయలు. మరియు మూడు రోజుల అన్న దానం కు సరిపడు కూరగాయలు ఉచితంగా ఇస్తున్న మార్కెట్ ప్రసాద్ కు ధన్యవాదాలు తెలిపారు. మార్కెట్ ప్రసాద్ ను ప్రత్యేకంగా ఆహ్వానించడమైనదని కమిటీ సభ్యులు అన్నారు. పూజ కార్యక్రమాలు 20 తేదీన గణపతి పూజ. 21 వతేదిన ఆలయంలో దేవతా మూర్తులకు అభిషేక పూజలు. ప్రదోష పూజలు . 22 వతేదిన ప్రాత కాల పూజలు. ప్రదేష పూజలు. దీక్ష హోమాలు. 23 వతేదిన కాల పూజలు దీక్ష హోమాలు ప్రతిష్ట హోమాలు. యంత్ర ప్రతిష్ట. ధ్వజ స్తంభ ప్రతిష్ట. మొదలగు కార్యక్రమాలు జరుగుతాయని కమిటీ సభ్యులు తెలిపారు. కావున అందరూ పాల్గొని స్వామి వార్ల కృపా కటాక్షములకు పాత్రులు కాగలరని కోరుచున్నామని తెలిపారు.

## ఎస్.ఎస్. సి.ఫలితాలకు అమ్మ ఒడికి సంబంధం ఏమి

ఏపీ న్యూస్,: ఆంధ్ర రాష్ట్రంలో ఎస్ఎస్సి ఫలితాల పర్సెంటేజ్ తగ్గిందని విపక్షాలు చాలా గోలపెడుతూ. అమ్మ ఒడి పథకం తగ్గించాలనే ఉద్దేశం తోటే ఫలితాలు పర్సంటేజ్ తగ్గిందని ప్రతిపక్షాలు గగ్గోలు పెడుతున్నాయి పేపర్లు దిద్దే ఉపాధ్యాయులు విద్యాబోధన చేసేది ఉపాధ్యాయులు మరి ఉపాధ్యాయులు పనితనం తప్పు పట్టకుండా ప్రభుత్వం మీద వేయడం అర్థం కావటం లేదు అమ్మ ఒడి అనేది ఎస్ఎస్సి వరకు మాత్రమే ఒక 10 తరగతి పాస్ అయిన వారికి విద్యా దీవెన వర్తిస్తుంది మరి అమ్మ ఒడి ఎలా తగ్గుతుంది ప్రభుత్వానికి ఉపాధ్యాయులకు మధ్యన అగాధము ఉంది వారి ఇరువురి మధ్యన విద్యార్థుల భవిష్యత్ నాశనం అవుతుందని ఎందుకు అనుకో కూడదని ఆంధ్రప్రదేశ్ విద్యార్థుల తల్లిదండ్రులు అనుకుంటున్నారు

# కేర్ హాస్పిటల్ ప్రారంభించిన ఎమ్మెల్యే మేడా మల్లి కార్జున రెడ్డి



ఒంటిమిట్ట జూన్ 13: కడప జిల్లా రాజంపేట నియోజకవర్గం మండల కేంద్రమైన ఒంటిమిట్టలో ఆదివారం ఎమ్మెల్యే మేడా వెంకట మల్లికార్జునరెడ్డి చేతులమీదుగా కేర్ హాస్పిటల్ ప్రారంభించారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఒంటిమిట్టలో కేర్ హాస్పిటల్ ప్రారంభించడం వల్ల చుట్టుపక్కల ప్రాంతాలకు మంచి అవకాశమన్నారు మండల వాసి డాక్టర్ మధుసూదన్ రెడ్డి హాస్పిటల్ ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడం మంచి శుభ పరిణామమన్నారు మానవునికి విద్య వైద్యం అందుబాటులో ఉండడం సంతోషకరమన్నారు ప్రజలందరూ వైద్యుని సలహాతో వైద్యం తీసుకోవాలని ఆయన మండల వాసులకు తెలియజేశారు అనంతరం డాక్టర్ మధుసూదన్ రెడ్డి మీడియా తో మాట్లాడుతూ తాను అనుకున్న కల నెరవేరిందని, తాను ఈ మండలంలో పుట్టి పెరిగినందుకు ఈ ప్రాంతం ప్రజలకు, సొంత గ్రామం రాశి పల్లె కు తన వంతుగా వైద్య సేవలు అందించేందుకు ఆసుపత్రిని నిర్మించడం జరిగిందన్నారు తాను ఇక్కడే చదువుకున్నానని,పల్లె ప్రజల ఋణం తీర్చు కొనే అవకాశం కలిగిందన్నారు సిద్ధవటం నందలూరు మండల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు 24 గంటలు వైద్యశాల అందుబాటులో ఉంటుందని, కీళ్ల నొప్పులు జ్వరం విష ప్రభావిత బారిన పడిన రోగులకు వైద్యం అందుబాటులో ఉంటుందన్నారు చుట్టుపక్కల మండల ప్రజలు సిద్ధవటం నందలూరు మండల వాసులు ప్రతి ఒక్కరూ కేర్ హాస్పిటల్ కి వచ్చి పరీక్షలు చేయించుకోవాలని హితవు పలికారు ఎల్లవేళలా వైద్యులు అందుబాటులో ఉంటారని ఆయన తెలియజేశారు ఈ కార్యక్రమంలో వైద్యులు నేలటూరు మధుసూదన్ రెడ్డి వెంకటసుబ్బారెడ్డి ఇతర వైద్యులు పాల్గొన్నారు

# ప్రజాలకు అందుబాటులో మూత్రాలయం

## తొలగిన చెత్త చెదారం ఊపిరి పీల్చుకున్నా కాలనీ వాసులు




కౌతాళం:మండల కేంద్రం లో రద్దీగా ఉన్న సుధ పాన్ షాప్ ఎదురుగా చెత్త చెదారం తో నిండి రాను పోను ప్రజలకు కంపు కొడుతూ ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నారు సర్పంచ్ స్పందించి నాయకులకు ఫిర్యాదు చేసి అదే ప్రదేశం లో చెత్తను తొలగించి ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా మూత్రాలయం నిర్మించారు. ఆదివారం సర్పంచ్, ఉపసర్పంచ్, మాజీ సర్పంచ్ ఆ మూత్రశాలయం ను ప్రారంభించారు. తొలగిన చెత్త, తో ఊపిరి పీల్చుకున్న కాలనీ వసూలు వారు మాట్లాడుతూప్రజలకు అందుబాటులో మూత్రశాలయం ఏర్పాటు చేసమనికౌతాళం గ్రామం నందు మెయిన్ బజార్ పంపన్న షాప్ పక్కన బంగారం షాప్ ముందర మూత్రలయం ప్రారంభిచడం జరిగిందని అక్కడ ఉన్న వ్యాపారస్తులు సమస్య మేరకు పంచాయతీ వారు స్పందించి మూత్రలయం కట్టించడం జరిగిందని తెలిపారు. ఎమ్మెల్యే బాల నాగ రెడ్డి సార్ సహకారం తో దేశాయ్ కృష్ణ ఆధ్వర్యంలో యం.డి.ఓ జగన్మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో పంచాయతీ సెక్రటరీ యోగేశ్వర్ రెడ్డి ఓపెన్ చేసి ప్రారంభించారు ఈ కార్యక్రమంలో తిక్కయ్య మాజీ సర్పంచ్ అవతారం ,వైస్ ఎంపీపీ బుజ్జి స్వామి, రామకృష్ణ ,మహానంది , తదితరులు పాల్గొన్నారు.

# అన్నపూర్ణాదేవి విగ్రహ ప్రతిష్టా కార్యక్రమం ప్రారంభం

శ్రీశైలం దేవస్థానం లో సోమవారం రోజు ఆలయ ప్రాంగణములో నిర్మించబడిన శ్రీ అన్నపూర్ణాదేవి ఆలయము నందు.(స్వామివారి యాగశాల సమీపంలో) విగ్రహప్రతిష్టాకార్యక్రమపూజాదికాలు ప్రారంభించబడ్డాయి.త్రయాహ్నిక దీక్షతో మూడు రోజులపాటు జరిగే ఈ కార్యక్రమములో ఆయా ప్రతిష్ఠా సంబంధి కార్యక్రమాలు నిర్వహించబడి, 15వ తేదీ ఉదయం అన్నపూర్ణ అమ్మవారి విగ్రహప్రతిష్ట, శిఖర ప్రతిష్ఠ కార్యక్రమాలు నిర్వహించబడుతాయి.సోమవారం ఉదయం వేదసస్వతి, గణపతిపూజ, పుణ్యాహవాచనం, ఋత్విగ్వరణం, యాగశాల ప్రవేశం, మండపారాధన, అన్నపూర్ణాదేవి విగ్రహానికి స్నపనం, జలాధివాస కార్యక్రమాలు జరిపించబడ్డాయి.వేదస్వస్తి:- సోమవారం రోజు ఉదయం అన్నపూర్ణాదేవి ఆలయమండపంలో ముందుగా వేదపండితులు వేదపారాయణలు చేసి వేదస్వస్తి నిర్వహించారు.సంకల్పం:- వేదపఠనం అయిన వెంటనే అర్చకస్వాములు, వేదపండితులు.లోక కళ్యాణాన్ని కాంక్షిస్తూ ప్రతిష్ఠా సంకల్పాన్ని పఠించారు. ఈ సంకల్పంలో దేశం శాంతి సౌభాగ్యాలతో విలసిల్లాలని, ప్రకృతి వైపరీత్యాలు సంభవించకుండా సకాలంలో తగినంత వర్షాలు కురిసి దేశం పాడిపంటలతో తులతూగాలని, జనులందరికి ఆయురారోగ్యాలు కలిగి వారికి అకాల మరణాలు జరగకుండా ఉండాలని, దేశంలో అగ్నిప్రమాదాలు, వాహన, ప్రమాదాలు మొదలైనవి . జరగకుండా ఉండాలని, ప్రజలందరు సుఖశాంతులతో ఉండాలంటూ ఆలయ అర్చకులు, వేదపండితులు సంకల్పం పఠించారు.గణపతి పూజ:- సంకల్పపఠనం తరువాత ప్రతిష్ఠా కార్యక్రమాలు నిర్విఘ్నంగా జరగాలని మహాగణపతి పూజ జరిపించబడింది.పుణ్యాహవచనం:-గణపతిపూజ తరువాత పుణ్యాహవచనం జరిపించబడింది. వృద్ధి మరియు అభ్యుదయాల కోసం ఈ పుణ్యాహవచనం నిర్వహించబడింది.ఋత్విగ్వరణం:- పుణ్యాహవాచనం తరువాత ఋత్విగ్వరణం నిర్వహించబడింది. ఉత్సవాలలో ఆయా వైదిక కార్యక్రమాలు నిర్వహించమని ఋత్వికులను ఆహ్వానిస్తూ వారికి దీక్షావస్త్రాలను అందజేసే కార్యక్రమానికి ఋత్విగ్వరణం అనిపేరుయాగశాల ప్రవేశం:- ఋత్వగ్వరణం తరువాత అర్చకస్వాములు, వేదపండితులు, సంప్రదాయబద్ధంగా యాగశాల ప్రవేశం చేశారు.ప్రతిష్ఠా కార్యక్రమాన్ని పురస్కరించుకుని అన్నపూర్ణాదేవి ఆలయసమీపంలో ప్రత్యేకంగా తాత్కాలిక యాగశాల నిర్మించబడింది.యాగశాల ప్రవేశం తరువాత మండపారాధన కార్యక్రమం నిర్వహించబడింది.స్నపనము:-మండపారాధన తరువాత అన్నపూర్ణాదేవి విగ్రహానికి స్నపన కార్యక్రమం జరిపించబడింది. స్నపనము తరువాత బలాధివాసం జరిపించబడింది. ఈ జలాధివాసంలో ప్రతిష్ఠించనున్న అమ్మవారి . విగ్రహాన్ని పవిత్రజలములో పరాండ పెట్టడం జరిగింది.జపపారాయణలు:- ఈ ప్రతిష్ఠా కార్యక్రమములో భాగంగానే పారాయణలుమూలమంత్రజపాలుజరిపించబడుతున్నాయి.మృత్సంగ్రహణం:- సోమవారం సాయంకాలం అర్చకస్వాములు, వేదపండితులు ఆలయప్రాంగణములోని నిర్ణీత ప్రదేశము నుంచి. మట్టిని సేకరించి యాగశాలకు తీసుకువస్తారు. దీనికే మృత్సంగ్రహణం అని పేరు.అంకురారోపణ:- ఈ అంకురారోపణ కార్యక్రమములో సేకరించిన మట్టిని పాలికలలో ( మూకుళ్ళలో నింపి, వాటిలో నవధాన్యాలను పోసి ఆ మట్టిలోనవధాన్యాలు మొలకెత్తించే పనిని ప్రారంభిస్తారు.అగ్నిప్రతిష్టాపన:-అంకురారోపణ తరువాత విగ్రహ ప్రతిష్ఠ కోసం ఏర్పాటు చేయబడిన యాగశాలలోని హోమగుండంలో అగ్నిప్రతిష్టాపన కార్యక్రమాన్ని జరిపిస్తారు.


# సంక్షేమ బోర్డు అమలుకు పోరాటం

కోడుమూరు, : సంక్షేమ బోర్డు అమలుకు ఆటో కార్మికులు పోరాటానికి సిద్ధం కావాలని ఆటో యూనియన్ సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రభాకర్ పిలుపునిచ్చారు స్థానిక సీఐటీయూ కార్యాలయంలో ఆటో యూనియన్ మహాసభను నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాడు వైఎస్ జగన్ పాదయాత్ర సందర్భంగా కార్మికులకు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చి విస్మరించారన్నారు అనంతరం ఆటో యూనియన్ మండల కమిటీని ఎన్నుకున్నారు సిఐటియు జిల్లా నాయకులు గఫూర్ మియా మండల కార్యదర్శి వీరన్న రాజు షేక్ష వలి పాల్గొన్నారు

# నెట్టింట మారుమ్రోగుతున్న 'జనగణమన'




మలయాళ క్రేజీ హీరో పృథ్వీరాజ్ సుకుమారన్ విభిన్నమైన ఆలోచనలతో ఆలోచనాత్మక చిత్రాలతో బ్యాక్ టు బ్యాక్ విజయాల్ని సొంతం చేసుకుంటున్నారు. ఆయన డైరెక్ట్ చేసి నటించిన పలు సూపర్ హిట్ మూవీస్ ప్రస్తుతం తెలుగులో రీమేక్ అవుతున్నాయి కూడా. ఇటీవల ఆయన నటించగా మలయాళంలో సూపర్ హిట్ గా నిలిచిన 'అయ్యప్పనుమ్ కోషియుమ్' తెలుగులో 'భీమ్లానాయక్' పేరుతో రీమేక్ అయిన బ్లాక్ బస్టర్ హిట్ అనిపించుకుంది.తాజాగా పృథ్వారాజ్ సుకుమారన్ నటించిన ఓ మూవీ నెట్టింట వైరల్ గా మారి మారుమ్రోగుతోంది. ఆయన నటించిన తాజా చిత్రం 'జనగణమన'. డిజో జోస్ ఆంటోనీ డైరెక్ట్ చేసిన ఈ మూవీలో పృథ్వీరాజ్ సుకుమారన్ సూరజ్ వెంజరమూడు హీరోలుగా నటించారు. మమతా మోహన్ దాస్ హీరోయిన్ గా నటించిన ఈ చిత్రానికి మలయాళ మెగాస్టార్ మమ్ముట్టి వాయిస్ ఓవర్ అందించారు. ఏప్రిల్ 28న విడుదలైన ఈ చిత్రం విమర్శకుల ప్రశంసలతో పాటు ప్రేక్షకుల నీకాజనాలందుకుంది.నెట్ ఫ్లిక్స్ లోనూ ఈ మూవీని విడుదల చేశారు. బ్లాక్ బస్టర్ హిట్ గా నిలిచిన ఈ చిత్రాన్ని నెటజన్స్ సోషల్ మీడియాలో విస్తృతంగా ప్రచారం చేస్తూ నెట్టింట మారుబ్రోగిస్తున్నారు. ఇప్పటికే 'జనగణమన' టైటిల్ ని స్టార్ డైరెక్టర్ పూరి జగన్నాథ్ తన లేటెస్ట్ మూవీ కోసం రిజిస్టర్ చేయించుకోవడం.. విజయ్ దేవరకొండ తో సినిమాని కూడా స్టార్ట్ చేయడంతో ఈ చిత్రాన్ని తెలుగులో 'జన' పేరుతో విడుదల చేశారు. అయితే సోషల్ మీడియాలో మాత్రం ఒరిజినల్ టైటిల్ ని ట్రెండ్ చేస్తూ నెటిజన్స్ హాట్ టాపిక్ గా మార్చేశారు.తెలుగు వెర్షన్ లో సేమ్ టైటిల్ తో సైలెంట్ గా విడుదలైన ఈ మూవీ మంచి టాక్ ని సొంతం చేసుకుంది. కేవలం 10 కోట్ల తో నిర్మించిన ఈ మూవీ భారీ స్థాయి బ్లాక్ బస్టర్ గా నిలిచి కేరళలో 50 కోట్లు వసూళ్లని రాబట్టడం సంచలనం సృష్టిస్తోంది. ఈ సినిమాని యూత్ నెటిజన్స్ ఓన్ చేసుకుని నెట్టింట హోరెత్తించడానికి ప్రధాన కారణం... ఇటీవల హైదరాబాద్ లో జరిగిన వరుస రేప్ సంఘటనలే నని తెలుస్తోంది. కొన్నేళ్ల క్రితం శంషాబాద్ లో జరిగిన రేప్ సంఘటన యావత్ దేశ వ్యాప్తంగా సంచలనం సృష్టించింది.ఆ తరువాత నిందితుల్ని ఎన్ కౌంటర్ చేయడం కూడా సంచలనంగా మారిన విషయం తెలిసిందే. వీటితో పాటు ఇటీవల జరిగిన జరుగుతున్న రేప్ సంఘటనలని ఈ సినిమాలో చూపించడం.. ఓ సాధారణ లాయర్ తనకు జరిగిన అన్యాయంపై సమర శంఖం పూరించిన తీరు ప్రతీ ఒక్కరినీ ఆలోచింపజేస్తోంది. ఇదే నెటిజన్ లని బాగా ఎట్రాక్ట్ చేసి సినిమాని నెట్టింట వైరల్ అయ్యేలా చేస్తోంది. అంతే కాకుండా యూనివర్సిటీల్లో జరిగే భావజాల అంతర్యుద్ధాలని కూడా ప్రధానంగా ఈమూవీలో చర్చించడంతో యూత్ బాగా కనెక్ట్ అవుతున్నారు.సినిమా అంతా రియలిస్టిక్ అప్రోచ్ తో సాగడంతో మన కళ్లముందు జరుగుతున్నట్టుగా ప్రేక్షకులకు ఫీల్ ని కలిగిస్తోంది. దీంతో ప్రతీ ఒక్కరూ ఈ మూవీని ఓన్ చేసుకుని సోషల్ మీడియాలో ప్రచారం చేస్తున్నారు.మమతా మోహన్ దాస్ ఇందులో ప్రొఫెసర్ గా నటించింది. ఆమెని రేప్ చేసి హత్య చేస్తారు. దీని వెనక ఎవరున్నారు? .. ఈ ఉదంతం వెనకున్న చీకటి కోణాలేంటీ? ఆ నిజాలని బయటికి తీయడం కోసం నిజాయితీగల అడ్వకేట్ ఏం చేశాడు? అన్నదే ఈ చిత్ర ప్రధాన కథ. ఇదే ఇప్పుడు ఈ మూవీని నెట్ ఫ్లిక్స్ లో భారీ సినిమాలైన ట్రిపుల్ ఆర్ గంగూబాయి కతియావాడీ చిత్రాలతో పోటీపడేలా చేస్తోంది. టాప్ 5 లో నిలిచిన ఈ మూవీ తర సత్తాని చాటుతూ రికార్డు స్థాయి వీవర్షిప్ తో దూసుకుపోతోంది.



# రొమాన్స్ కి ఇక నయనతార చరమగీతం!

నయనతార-విగ్నేష్ శివన్ ఏడేళ్ల ప్రేమకి ఫుల్ స్టాప్ పడింది. నిన్నటితో ఎట్టకేలకు వివాహ బంధంతో ఒకటయ్యారు. ఇక పై భార్యాభర్తలు గా ప్రేక్షకుల్ని మెప్పించనున్నారు. ఇప్పుడేం చేసినా? అంతా అధికారికమే. రూమర్లు ఉండవు. భర్తతో ఎలా కలిసి జీవించాలన్నది ఇష్టా ఇష్టాలపై అధారపడి ఉంటుంది. వివాహ బంధంతో ఎన్నో మార్పులు చోటు చేసుకోవడానికి ఆస్కారం ఉంది.కొన్ని రకాల స్వేచ్ఛల్ని సైతం కోల్పోవాల్సి ఉంటుంది. వృత్తిగతంగా నియమ నిబంధనలు పాటించాలా? వద్దా? అన్నది భార్య భర్తల నిర్ణయాలు..అభిప్రాయాల మీద ఆధారపడి ఉంటుంది. అయితే ఇక్కడ ఒకటి మాత్రం బలంగా



చెప్పాలి. పెళ్లికి ముందున్నంత స్వేచ్ఛ ఉండదు. వ్యక్తిగతంగా కొన్ని పరిమితులు విధుంచుకోక తప్పదు. ఈ నేపథ్యంలో వెండి తెరపై నయన్ మునుపటి అంత గ్లామర్ మెరుపులు మెరిపించలదా? అంటే అందుకు ఛాన్సెస్ తక్కువగానే కనిపిస్తాయి.విగ్నేష్ ని వివాహం చేసుకోవడానికి నయన్ పెద్ద యుద్ధమే చేసింది.క్రైస్తవ మతం నుంచి హిందు మతంలోకి మారింది. పెళ్లికి ముందు ఎన్నో యజ్ఞయాగాలు చేసింది. హిందు ధర్మం ప్రకారం పాటించాల్సిన ఆచారాలు..దోష నివారణలో భాగంగా ప్రత్యేక పూజలు ఇలా ఎన్నోచేసింది. అన్ని విజయవంతంగా పూర్తి చేయడానికి ఎంతో సమయం తీసుకుంది. ఇలా కొంత ప్రాసస్ జరిగిన తర్వాత నయన్ కి పెళ్లి జరిగింది.విగ్నేష్ తో ఎంతో జీవితాన్ని..బంగారు భవిష్యత్ ని డిజైన్ చేసుకుంది. ఈ నేపథ్యంలో నయనతార రొమాంటిక్ రోల్స్ కి చరమగీతం పాడినట్లే అని సంకేతాలు అందుతున్నాయి. ప్రస్తుతం చేతిలో ఉన్న ప్రాజెక్ట్ లు పూర్తిచేసి ఆ తర్వాత చాలా సెలక్టివ్ గా కెరీర్ ని ప్లాన్ చేసుకుంటుందని అంటున్నారు. లేడీ ఓరియేంటెడ్ పాత్రలు...నటనకు ఆస్కారం ఉన్న ఇమేజ్ రోల్స్ లోనే ఎక్కువగా కనిపించే అవకాశం ఉందని సంకేతాలు అందుతున్నాయి.అలాగే భర్తతో కలిసి చిత్ర నిర్మాణంలో ప్రధాన భూమిక పోషించనుందని అంటున్నారు. తెరపై రొమాంటిక్ గా కనిపించడం విషయంపైనా చాలా జాగ్రత్తలు తీసుకునే అవకాశం కనిపిస్తుందని తెలుస్తోంది. నయనతార అవసరం మేర స్క్రిప్ట్ డిమాండ్ మేరకు..దర్శకుల అభిరుచి మేరకు ఎలా నటించడానికైనా ఇన్నాళ్లు సిద్ధంగానే ఉంది.కానీ నయన్ బయట ఈవెంట్లకు హాజరయ్యేటప్పుడు మాత్రం చాలా సంప్రదాయంగా కనిపిస్తుంది. వీలైనంత ట్రెడీషనల్ గా కనిపించడానికే ఎక్కువగా ఇష్ట పడుతుంటుంది. సారీ...పంజాబీ డ్రెస్ లనే ఎక్కువగా వినియోగిస్తుంటారు. తాజాగా పెళ్లైన నేపథ్యంలో మరిన్ని జాగ్రత్తలు తీసుకునే అవకాశం కనిపిస్తుంది.ప్రస్తుతం నయనతార బాలవుడ్ లో షారుఖన్ సరసన 'జవాన్' చిత్రంలో నటిస్తోంది. ఈ చిత్రంలో గ్లామర్ గా కనిపించే అవకాశం ఉంది. అలాగే మెగాస్టార్ చిరంజీవి కథానాయకుడిగా నటిస్తోన్న 'గాడ్ ఫాదర్' లోనూ నటిస్తుంది. కానీ చిరు సినిమాలో గ్లామర్ పాత్రకు ఆస్కారం ఉండదు కాబట్టి నయన్ సాఫ్ట్ గానే కనిపించే అవకాశం ఉంది.

# ఐపీఎల్ ప్రసార హక్కులను దక్కించుకున్న సోనీ, జియో! ఒక్కో మ్యాచ్‌కు ఎంతంటే!




ఐపీఎల్ ప్రసార హక్కులను సోనీ, జియో సంస్థలు దక్కించుకున్నట్లు తెలుస్తోంది. 2023-2027 కాలానికి గాను మీడియా హక్కులు రూ. 44,075 కోట్లకు అమ్ముడు పోయిటన్లు సమాచారం. టీవీ ప్రసార హక్కులను 23,575 కోట్లకు సోనీ దక్కించుకోగా.. డిజిటల్ ప్రసార హక్కులను 20,500 కోట్లకు జియో సొంతం?చేసుకున్నట్లు జాతీయ మీడియా వర్గాలు వెల్లడించాయి. కాగా టీవీ ప్రసార హక్కుల కోసం ఒక్కో మ్యాచ్ కు రూ. 49 కోట్లు బేస్ ప్రైజ్ గా నిర్ణయించగా.. డిజిటల్ హక్కులు రూ. 33 కోట్లుగా నిర్ణయించారు.అయితే ఈ బిడ్డింగ్‌లో టీవీ ప్రసార హక్కులు ఒక్కో మ్యాచ్‌కు రూ.57.5 కోట్లు, డిజిటల్ స్ట్రీమింగ్ రైట్స్ గరిష్టంగా రూ.50 కోట్లకు అమ్ముడు పోయాయి. ఇక ముంబై వేదికగా జరిగిన ఈ బిడ్డింగ్‌లో డిస్నీ స్టార్, సోనీ నెట్‌వర్క్, వయాకామ్ రిలయన్స్ 18, జీ, ఫన్ ఆసియా, సూపర్ స్పోర్ట్, టైమ్స్ ఇంటర్నెట్ వంటి దిగ్గజ కార్పొరేట్ కంపెనీలు పోటీ పడ్డాయి.

## 'టీ20 ప్రపంచకప్ భారత జట్టులో అతడు ఖచ్చితంగా ఉండాలి'

టీ20 ప్రపంచకప్-2022లో టీమిండియా ప్లేయింగ్ ఎలెవన్‌లో ఇషాన్ కిషన్ ఖచ్చితంగా ఉండాలని భారత మాజీ ఓపెనర్ గౌతమ్ గంభీర్ అభిప్రాయపడ్డాడు. ఆస్ట్రేలియా వంటి బౌన్సీ పిచ్‌లలో కిషన్ బ్యాక్‌ఫుట్ షాట్‌లు అద్భుతంగా ఆడగలడని గంభీర్ తెలిపాడు."కేఎల్ రాహుల్, రోహిత్ శర్మ, విరాట్ కోహ్లి వంటి ఆటగాళ్లు జట్టులోకి వచ్చినా ఇషాన్ కిషన్‌కు తుది జట్టులో చోటు ఇవ్వాలి.రోహిత్.. కిషన్‌తో కలిసి ఇన్నింగ్స్‌ను ఆరంభించి, రాహుల్ మిడిలార్డర్‌లో బ్యాటింగ్‌కు వస్తే బాగుంటుంది. ఎందుకుంటే ఆస్ట్రేలియా వంటి బౌన్సీ పిచ్‌లపై కిషన్ అద్భుతంగా ఆడగలడు. కాబట్టి టీ20 ప్రపంచకప్ భారత ప్లేయింగ్ ఎలెవన్‌లో కిషన్ ఖచ్చితంగా ఉండాలి. అతడు రన్స్ చేసిన చేయకపోయినా జట్టులో సానుకూల దృక్పథం తీసుకు వస్తాడు "అని గంభీర్ పేర్కొన్నాడు.

EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY AVULA VIJAYA BHASKARA REDDY PRINTED AT SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL - 518 001. ANDHRA PRADESH.
PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190